ప్రతిపక్షం

www.prathipaksham.in

శుక్రవారం 03.04.2026 | Published From Hyderabad | సంపుటి: 19 సంచిక: 14 పేజీలు: 10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



ఒక్క రనౌట్... సన్ రైజర్స్ భారీ విజయం 10

జిల్లాకో మండలంలో 'సమీకృత భూభారతి'

45 రోజుల తరువాత 2వ దశ అమలు



- ప్రతి జిల్లాలోని 70 గ్రామాల్లో పూర్తిస్థాయి సర్వే
- ప్రతి సర్వే నెంబర్‌కు భూధార్ కేటాయింపు
- వీలైనంత త్వరగా సాదాబైనామాలకు పరిష్కారం
- ఎన్నికల్లో ఫలితాలు చూసినా జ్ఞానోదయం కలగలేదు
- అసెంబ్లీలో టెర్రరిస్టుల్లా ప్రవర్తించారు
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఏప్రిల్ 2: రాష్ట్రంలో ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను 45 రోజుల పాటు పరిశీలించి తర్వాత అవసరమైన మార్పులు, చేర్పులతో జిల్లాకొక మండలంలో ప్రవేశపెడతామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలంలోని మితాయిపల్లి గ్రామంలో జరిగిన గ్రామసభలో ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ను మంత్రి పొంగులేటి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రెవెన్యూ శాఖలో విప్లవాత్మక సంస్కరణలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఈ రోజున ఈ అమనగల్ మండలంతోపాటు ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, సంగారెడ్డి జిల్లా వట్పల్లి, నారాయణపేట జిల్లా

...:: మిగతా 2లో



గ్యారంటీలపై సందేహాలుంటే తెలంగాణకు రండి

కేంద్ర నిధులు మోడీ కరుణ కాదు.. ప్రజల హక్కు

- అవినీతి, కుటుంబ పాలనలో ఒకేలా కేసీఆర్, విజయన్
- ఇక యూడీఎఫ్ స్వర్ణయుగం మొదలవుతుంది
- విజయన్, కేసీఆర్‌ల మధ్య అనేక పోలికలు
- కేరళలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- యూడీఎఫ్ మేనిఫెస్టో విడుదల

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

కొచ్చి, ఏప్రిల్ 2: యూడీఎఫ్ ప్రకటించిన గ్యారంటీలపై విమర్శలు చేస్తున్న వారు అవి ఎలా అమలవుతాయో తెలుసుకోవాలంటే తెలంగాణకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో అమలవుతున్న పథకాలను ప్రత్యక్షంగా చూసి, తమ ట్రాక్ రికార్డు పరిశీలించుకోవచ్చని ఆయన సూచించారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆయన మంత్రులు తెలంగాణకు వస్తే తాము గ్యారంటీలు ఎలా అమలు చేస్తున్నామో ప్రత్యక్షంగా చూపుతామని సీఎం తెలిపారు. కేరళం శాసనసభ ఎన్నికలకు సంబంధించి యూడీఎఫ్ మేనిఫెస్టోను కొచ్చిలో గురువారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేరళంలో పినరయి విజయన్ హయాం ముగిసిందని, ఇక యూడీఎఫ్ స్వర్ణయుగం మొదలవుతుందన్నారు.

మోడీ బ్రదర్స్.. పినరయి, కేసీఆర్‌ల మధ్య పోలికలు

ముఖ్యమంత్రి పినరయి విజయన్, ప్రధానమంత్రి

...:: మిగతా 2లో

సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజీలేదు

- ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ ప్రజా పాలన
- ఒక ఉద్యమంలా 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'
- గ్రామ సభలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు సీఎం సందేశం

...:: 2లో



విభజన హామీలన్నీ అమలు చేయాల్సిందే

- రాజ్యసభలో తెలంగాణ ఎంపీల డిమాండ్
- రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చ
- తెలంగాణకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- డిమాండ్ చేసిన టీ ఎంపీలు
- 12 ఏళ్ల తర్వాత కూడా ఆస్తుల పంపకం పూర్తికాలేదు: రేణుకా చౌదరి
- కేసీఆర్ పోరాటం వల్లే తెలంగాణ సాకారమైంది: బీఆర్ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి
- కేసీఆర్ కుటుంబం కాళేశ్వరాన్ని ఏటీఎంగా వాడుకుంది: కిషన్ రెడ్డి
- సురేశ్‌రెడ్డికి, కిషన్ రెడ్డికి మధ్య మాటల యుద్ధం



ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: రాష్ట్ర విభజన హామీలపై తెలంగాణకు చెందిన ఎంపీలు, రాజ్యసభ సభ్యులు గళమెత్తారు. అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చ సమయంలో తెలంగాణ ఎంపీలు రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్‌లో ఉన్న విభజన హామీలను వెంటనే అమలు చేయాలంటూ డిమాండ్ చేశారు. రాష్ట్రం విడిపోయి 12 ఏళ్లు అవుతున్నా విభజన హామీలను ఇంకా అమలు చేయలేదని కేంద్ర ప్రభుత్వ తీరుపై తూర్పారబట్టారు. ఏపీకి ఇస్తున్న ప్రాధాన్యత తెలంగాణకు దక్కడం లేదని వారు కేంద్రంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. విభజన సమయంలో ఇచ్చిన హామీల్లో అమలుకాని వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

విభజన హామీలన్నీ అమలు చేయాల్సిందే..

గత రెండు రోజుల నుంచి ఇటు పార్లమెంట్లో, అటు రాజ్యసభలో తెలంగాణ సభ్యులు కేంద్రం చూపుతున్న వివక్షపై

...:: మిగతా 2లో

అమరావతికి రాజ్యసభలోనూ పచ్చజెండా ...:: 2లో

చేనేత కార్మికుల పొట్టకొడుతున్న కాంగ్రెస్

- యూనిఫాం ఆర్డర్ రద్దు చేయడం దుర్మార్గం
- చేనేత కార్మికులకు నష్టం చేస్తే ఊరుకునేది లేదు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఏప్రిల్ 2 : రేవంత్ రెడ్డి సర్కార్ చేనేత కార్మికుల జీవితాలను అంధకారంలోకి నెట్టేసే కుట్రలు చేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో మండిపడ్డారు. ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉన్న విద్యాశాఖ ఆధ్వర్యంలోని యూనిఫాంల ఆర్డర్ ను ఏకపక్షంగా రద్దు చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆర్డర్లపై ఆధారపడిన చేనేత కార్మికుల పొట్ట కొట్టే దుర్మార్గం చేస్తున్నారని విమర్శించారు. విద్యా శాఖ ఆధ్వర్యంలో ఏటా సుమారు రూ. 105 కోట్ల విలువైన యూనిఫాంల ఆర్డర్ ను రాష్ట్రంలోని 393 చేనేత సహకార సంఘాలకు ఇస్తుంటారని, దీని ద్వారా సహకార సంఘాల్లోని వేలాది మంది

...:: మిగతా 2లో

అమెరికా లొంగేవరకు యుద్ధం

- ఇరాన్ తాజా హెచ్చరిక
- ఇరాన్‌లోని ఐకానిక్ బ్రిడ్జి ధ్వంసం
- యూఎస్, -ఇజ్రాయెల్ భీకర దాడి
- ఇరాన్ ప్రతీకార దాడులు
- జోర్డాన్‌లోని అల్ అజ్రాక్ స్థావరంపై దాడి
- హోర్ముజ్‌ను తెరిపించేందుకు 35 దేశాల సమావేశం
- సమావేశానికి హాజరైన భారత్

ప్రతిపక్షం, నేషనల్ డెస్క్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు ఇరాన్ గురువారం తీవ్రంగా స్పందించింది. శాశ్వత అవమానాన్ని, పశ్చాత్తాపాన్ని, లొంగుబాటును అమెరికా చవిచూసేంత వరకు ఈ యుద్ధం కొనసాగుతుందని ఇరాన్ హెచ్చరించింది. ఇరాన్ నౌకదాళం, వైమానిక దళం దారుణంగా క్షీణించిపోయాయని, ఆ దేశ నాయకత్వం భారీ నష్టాలను ఎదుర్కొందంటూ ట్రంప్ బుధవారం రాత్రి చేసిన ప్రసంగానికి ఇరాన్ ఈ విధంగా స్పందించింది. ఇరాన్ సైనిక సదుపాయాలను,

...:: మిగతా 2లో





అబద్ధాలతో చరిత్ర వక్రీకరణ

- పార్లమెంట్‌లో విషం కక్కుతారా?
- తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచిన కిషన్ రెడ్డి
- ఏడు మండలాలను ఏపీకి కట్టబెట్టింది బీజేపీ ప్రభుత్వమే
- నాడు కాళేశ్వరంపై ప్రశంసలు..
- నేడు రాజకీయ లబ్ధి కోసం అబద్ధాలా?
- మాజీ మంత్రి హరీష్‌రావు ధ్వజం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరబాద్, ఏప్రిల్ 2: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పార్లమెంట్ సాక్షిగా మరోసారి ద్రోహానికి పాల్పడ్డారని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. రాజ్యసభలో కిషన్ రెడ్డి పచ్చి అబద్ధాలతో,

...:: మిగతా 2లో

ప్రైవేటు సంస్థలకు వత్తాసు పలకడమేనా ప్రజా పాలన?

- ఇది ప్రజా ప్రభుత్వమా.. లేక 'ప్రైవేట్' లిమిటెడ్ కంపెనీయా?
- నేతన్నల ఉసురు పోసుకుంటున్న కర్కశ కాంగ్రెస్
- టెస్కోకు ఆర్డర్లు రద్దు చేసి చేనేతల పొట్ట కొడుతుంది
- బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్‌కేటీఆర్



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరబాద్, ఏప్రిల్2: ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటు సంస్థలకు వత్తాసు పలకడమేనా ప్రజా పాలన? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. 'టెస్కోకు విద్యాశాఖ షాక్' అని ఓ ప్రముఖ దినపత్రికలో వచ్చిన కథనాన్ని ఎక్స్‌లో కేటీఆర్ ట్యాగ్ చేస్తూ రేవంత్ సర్కార్ రాష్ట్ర ప్రభుత్వ సంస్థ టెస్కోకు ఆర్డర్లు రద్దు చేసి ప్రైవేట్ కంపెనీలకు ఇచ్చి చేనేత సంఘాల కార్మికుల పొట్ట కొడుతుందని, ఇది ప్రజా ప్రభుత్వమా.. లేక 'ప్రైవేట్' లిమిటెడ్ కంపెనీయా..? అని మండిపడ్డారు. రూ. 105 కోట్ల విలువ గల స్కూల్ యూనిఫామ్ ఆర్డర్‌ను వెనక్కి తీసుకోవడం వెనుక మతలబు ఏంటి..? అని ప్రశ్నించారు. సంక్షేమ శాఖ నుండి టెస్కోకు దక్కాల్సిన రూ. 200 కోట్ల దుస్తులు, దుప్పట్ల ఆర్డర్ ఇంకా ఇవ్వకపోవడం వెనుక కారణం ఏంటి..? అని అడిగారు. కాంగ్రెస్ దండుపాళ్యం ముఠా కమీషన్లు దండుకోవాలనే యావలో ప్రైవేట్ వ్యక్తులకు ఆర్డర్లు ఇస్తున్నదని ధ్వజమెత్తారు. కర్కశ కాంగ్రెస్ ప్రభుత్వానికి చరమగీతం పాడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.



అత్యంత అవినీతి సీఎం హిమంత బిశ్వశర్మ

అసోం సీఎం హిమంత బిశ్వశర్మ దేశంలోనే అత్యంత అవినీతిపరుడైన సీఎం అని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాతో కలిసి అసోం సీఎం ల్యాండ్ ఏటీఎంను నడుపుతున్నారని విమర్శించారు.

9



హర్మూజ్‌పై యూకే చర్చలు భారత్‌కు ఆహ్వానం

హర్మూజ్ జలసంధిని తెరిపించే అంశంపై చర్చల కోసం భారత్ సహా పలు దేశాలను యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) ఆహ్వానించిందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు.

9



రాఘవ్ చద్దాకు షాకిచ్చిన 'ఆప్'

ఆమ్ ఆద్మీ పార్టీ తమ స్వంత ఎంపీ రాఘవ్ చద్దాకు షాకిచ్చింది. రాజ్యసభ డిప్యూటీ నేత హోదా నుంచి అతన్ని తప్పించింది. అతని స్థానంలో పంజాబ్ ఎంపీ అశోక్ మిట్టల్‌ను భర్తీ చేసింది.

9



ప్రజలు విసిగిపోయారు

కేరళలో బీజేపీకి మద్దతు పెరుగుతుందని, తిరువనంతపురం స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించిన విజయం ఇందుకు నిదర్శనమన్నారు ప్రధాని నరేంద్ర మోదీ.

9

రాష్ట్రీయం

సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజీలేదు

- ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ ప్రజా పాలన
- ఒక ఉద్యమంలా 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'
- గ్రామ సభలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు సీఎం సందేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్2: ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి రెండు సంవత్సరాల మూడునెలలు పూర్తయ్యిందని, ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ, గత పాలకుల తప్పిదాలను సరిచేస్తూ, సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజీపడకుండా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా రాష్ట్రమంతటా గ్రామ సభలు జరుగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి ప్రజలకు ప్రకటర ద్వారా సందేశం అందించారు. 'మేం పాలకులం కాదు. సేవకులం అన్న భావనతో ప్రజల ఆకాంక్షలు, అవసరాలే కేంద్ర బిందువుగా నిత్యం శ్రమిస్తున్నాం. ప్రతి నిర్ణయం లో ప్రజల మేలు, సామాజిక బాధ్యత, రాష్ట్ర భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుంటున్నాం. ఉప ఎన్నికలు, పంచాయతీ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో వరుస విజయాలతో ప్రజా పాలనకు మీ ఆమోదం, మద్దతు ప్రకటించారు. మీరు ఇచ్చిన ఈ ఫలితాలు మా బాధ్యతను మరింత పెంచాయి.' అని తెలిపారు. ప్రభుత్వ పథకాలు అంటే కాగితాలపై కాదు, ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తేవాలన్నది మా సంకల్పం అని అన్నారు. ఆ ఉద్దేశంతోనే "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. మార్చి 6 నుండి 99 రోజుల పాటు, గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు, అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం ఒక ఉద్యమంలా సాగుతోందని వివరించారు. 'ఊరు వాడ సమస్యల పరిష్కారమే పరమావధిగా ప్రతి అధికారి పని చేయాలి. వేగంగా ఫైళ్ల క్లియరెన్స్, ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత, నిర్ణయాల్లో పారదర్శకత ఉండాలి. మహాలక్ష్మి ఉచిత బస్సు సౌకర్యం, ₹ 500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ళు, మహిళా సాధికారత వంటి పథకాలు అర్హులకు చేరేలా ఈ కార్యక్రమం జరగాలి. "తెలంగాణ రైజింగ్ - 2047" విజన్‌తో ఆర్థికంగానే కాకుండా, అన్నీ రంగాల్లో తెలంగాణను ప్రపంచంలో నంబర్ వన్‌గా నిలపాలన్నది మన సంకల్పం. ఈ సంకల్పంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి. క్యూర్, ప్యూర్, రేర్‌గా రాష్ట్రాన్ని వర్గీకరించుకున్నాం. వాటి పరిధిలో సేవా, తయారీ, వ్యవసాయ రంగాల్లో ప్రపంచానికి ఆదర్శంగా మనం ఎదగాలి. ఈ 99 రోజుల కార్యాచరణ ఒక సాధారణ కార్యక్రమం కాదు. ఒక దీక్ష. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ఒక్కటై... దేశానికి, ప్రపంచానికి ఆదర్శంగా ఎదగాలి. ఇదే నా కల. ఆ కలను సాకారం చేయడంలో ప్రతి తెలంగాణ బిడ్డ భాగస్వామి కావాలి' అని సీఎం కోరారు.

చేనేత కార్మికుల పొట్టకొడుతున్న కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి

చేనేత కార్మికులు ఉపాధి పొందుతున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏకపక్షంగా విద్యాశాఖ యూనిఫాంల ఆర్డర్ రద్దు చేయటంతో ఇప్పుడు కార్మికులు వీధిన పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ శాఖలు, ఇతర డిపార్ట్మెంట్లకు సంబంధించిన రూ. 200 కోట్ల విలువైన దుప్పట్లు, ఇతర దుస్తుల పంపిణీకి సంబంధించిన ఆర్డర్ ను కూడా టెస్కో కు ఇప్పటికీ ఇవ్వకపోవడం కార్మికులను సంక్షోభంలోకి నెట్టివేయడమేనన్నారు. గడువు ముగిసినప్పటికీ టెస్కో కు ఆర్డర్లు ఇవ్వకుండా ఆ సంస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు కావాల్సిన ప్రైవేట్ వ్యక్తులకు ఈ ఆర్డర్లను ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. చేనేత కార్మికులకు అన్యాయం చేసే ఈ చర్యను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. లేదంటే కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని కవిత హెచ్చరించారు.

అబద్ధాలతో చరిత్ర వక్రీకరణ

మొదటిపేజీ తరువాయి

చరిత్ర వక్రీకరణలతో తన లోపలి వికృతత్వాన్ని బయట పెట్టుకున్నారని ఆరోపించారు. ఏడు మండలాలను ఏపీకి అప్పగించాలనేది విభజన చట్టంలో ఉందని కిషన్ రెడ్డి పేర్కొనడం చారిత్రక అవాస్తవమే కాదు.. తెలంగాణకు చేస్తున్న తీరని ద్రోహమని అన్నారు. విభజన చట్టానికి సవరణ తెచ్చి ఆర్డినెన్స్ ద్వారా ఏడు మండలాలను ఏపీకి కట్టబెట్టింది ముమ్మాటికి బీజేపీ ప్రభుత్వమేనని విమర్శించారు. కాళేశ్వరం పై రేవంత్ చేస్తున్న దుష్ప్రచారాన్ని వల్లెవేస్తూ పార్లమెంట్ లో విషం కక్కుతారా? నాడు కాళేశ్వరంపై ప్రశంసలు కురిపించి, నేడు రాజకీయ లబ్ధి కోసం అబద్ధాలా? తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తూ.. తెలంగాణ గొంతు కోస్తారా? అంటూ ప్రశ్నించారు. ఈ పాపంలో కిషన్ రెడ్డికి కూడా పాత్ర ఉందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంట అన్నట్లు చరిత్రను వక్రీకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ సాక్షిగా చరిత్ర వక్రీకరణకు పాల్పడి తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానించారని వెల్లడించారు. కాళేశ్వరంపై రేవంత్ రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్నే కిషన్ రెడ్డి పార్లమెంట్ లో చేయడం కాంగ్రెస్, బిజేపీ చీకటి పొత్తుకు సాక్ష్యమని స్పష్టం చేశారు. కేబినెట్ మంత్రిగా ఉండి, ఏ ప్రభుత్వం అయినా ప్రజా ధనంతోనే నిర్మాణాలు చేస్తుందన్న ఇంగితం మరిచి కేసీఆర్ జేబులోంచి డబ్బు ఖర్చు పెట్టారా అని అడగడం అవివేకానికి, అతి తెలివికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. గతంలో బీజేపీ ప్రభుత్వ పెద్దలే నితిన్ గడ్కరీ నుంచి సీడబ్ల్యూసీ చైర్మన్ మసూద్ వరకు కాళేశ్వరంపై కురిపించిన ప్రశంసలు అబద్ధం అంటారా? అవివేకం అంటారా ? చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని, తెలంగాణకు నిధులు కేటాయించాలని ఎంపీ సురేశ్ రెడ్డి ఎంతో హుందాగా బాధ్యతగా మాట్లాడిన దాన్ని సమర్థించకపోగా ఉల్టా బాధ్యత మరిచి వ్యర్థ రాజకీయ ప్రేలాపనలకు పాల్పడ్డాడని హరీశ్‌రావు విమర్శించారు.



ఓర్లిన్ పేట్ సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొన్నం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్2: ఈనెల 4న పుదుచ్చేరిలోని ఓర్లిన్ పేట్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ముఖ్య అతిథిగా హాజరుకానున్న భారీ బహిరంగ సభ ఏర్పాట్లను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర ముఖ్య నేతలతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ముకుల్ వాస్నిక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉత్తరాఖండ్ ఎమ్మెల్యే క్వాజీ నిజాముద్దీన్, పుదుచ్చేరి ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వీ . వైతిలింగం , పుదుచ్చేరి సీఎల్పీ నేత వైత్యనాథన్, మాజీ ముఖ్యమంత్రి నారాయణ స్వామి, ఏఐసీసీ సెక్రటరీ అంజలి, ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



అగ్రవర్ణాల పెత్తందారీ వ్యవస్థను ఎదిరించిన సర్వాయి పాపన్న

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్ 2: బీసీ, ఎస్సీ, ఎస్టీ లపై అగ్రవర్ణాల పెత్తందారీ వ్యవస్థను నాలుగు శతాబ్దాల క్రితమే ఎదురించిన ధీశాలి సర్దార్ సర్వాయి పాపన్న అని తెలంగాణ జాగృతి కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎదురుగట్ల సంపత్ గౌడ్ అన్నారు. 8 ఏళ్ల వయసులోనే ఆయనలో తిరుగుబాటు తత్వం ఉండేదని చెప్పారు. అగ్రవర్ణాల ఆగడాలను తట్టుకోలేక బహుజనవాదంతో పెద్ద సైన్యాన్నే తయారు చేశారన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా జాగృతి కార్యాలయంలో జాగృతి నాయకులు నివాళులు అర్పించారు. సర్దాయి పాపన్న గౌడ్ మాదిరిగానే బీసీ, ఎస్సీ, ఎస్టీలకు మేలు చేయాలన్న సంకల్పంతో కవితక్క ముందుకు వస్తున్నారని అన్నారు. ఆమె నాయకత్వంలో సర్దార్ పాపన్న గౌడ్ స్ఫూర్తితో ముందుకు సాగుదామని చెప్పారు.



మాల్దాలో జుడీషియల్ అధికారుల బందీపై తనకు కేంద్రం, ఎన్నికల సంఘం సమాచారం ఇవ్వలేదు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని చూపిస్తూ అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేసి 'రాష్ట్రపతి పాలన' విధించాలని బీజేపీ కుట్ర పన్నుతోంది. పరిపాలన అంతా ఎన్నికల సంఘం చేతుల్లోనే ఉంది, అధికారుల రక్షణలో సంఘం విఫలమైంది.
- పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

గ్యారంటీలపై సందేహాలుంటే తెలంగాణకు రండి

మొదటిపేజీ తరువాయి

నరేంద్ర మోదీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశాన్ని, కేరళంనూ మోదీ బ్రదర్స్ పాలిస్తున్నారని, మోదీ, విజయన్‌ను ఉద్దేశించి సీఎం వ్యాఖ్యానించారు. దేవుడి స్వంత రాష్ట్రంలో దేవుడి ఆస్తికీ రక్షణ లేదంటూ పరోక్షంగా శబరిమల బంగారం ఉదంతాన్ని సీఎం లేవనెత్తారు. కేరళంలో గత పదేళ్లుగా పినరయి విజయన్ ప్రభుత్వం కొనసాగుతోందని, అలాగే 2014 నుంచి సుమారు పదేళ్ల పాటు కేసీఆర్ తెలంగాణను పాలించారన్నారు. కుటుంబ పాలన, అవినీతి, అసమర్థ పాలన విషయంలో పినరయి విజయన్, కేసీఆర్‌ల మధ్య అనేక పోలికలు ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. 2023లో తెలంగాణలో మాదిరి మార్పే ఈ సారి కేరళంలో చోటుచేసుకుంటుందని సీఎం అన్నారు. పినరయి విజయ్ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దింపుతారని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. "పో మోనే విజయా" వ్యాఖ్యపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. విజయన్ తమకు రాజకీయ ప్రత్యర్థి అని, మోదీలా మాట్లాడటం తనకు సాధ్యం కాదని, విమర్శించకుండా ఉండటం తన స్వభావం కాదని స్పష్టం చేశారు. అవినీతి నియంత్రణ, ఆదాయానికి గండిపెట్టే అంశాలను నియంత్రించడం, కేంద్ర పథకాల గరిష్ట వినియోగం, రాష్ట్రానికి రావలసిన నిధుల సాధన.. తమ ప్రాధాన్య అంశాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కరుణ కాదని.. అది ప్రజల హక్కు అనే విషయం ప్రజలకు తెలియజేస్తామని సీఎం తెలిపారు. యూడీఎఫ్ కార్మికుల కూటమి అని, కూటమిలో నిజాయితీగల నాయకులు ఉన్నారని సీఎం వ్యాఖ్యానించారు.

తొలి క్యాబినెట్ నుంచే హామీల అమలు

కేరళంలో యూడీఎఫ్ గ్యారంటీలు అమలు సాధ్యమా అని కొందరు సందేహాలు వ్యక్తం చేస్తున్నారని.. దానికి సమాధానం తెలంగాణ రాష్ట్రమే అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి కేబినెట్ సమావేశం నుంచే గ్యారంటీలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. 25 లక్షల రైతు కుటుంబాలకు చెందిన రూ.21 వేల కోట్ల రుణాలను తాము మాఫీ చేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సాగు చేసుకునే రైతులకు ఎకరాకు రూ.12 వేలు చొప్పున ఏడాదికి రూ.18 వేల కోట్లు రైతు భరోసా కింద అందజేస్తున్నామని సీఎం తెలిపారు. 67,173 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, వివిధ శాఖల్లో నియామకాలు పూర్తి చేయడంతో పాటు ప్రజల సమక్షంలో ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశామని సీఎం వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, 10 వేల బస్సులు, 50 వేల సిబ్బందితో ఉన్న ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల్లోకి తీసుకువచ్చామని సీఎం తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు నెలకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు ఆదా అవుతోందన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. మహిళలను బస్సుల యజమానులుగా, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామని సీఎం తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ 2047 ప్రకారం తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపనున్నామని సీఎం ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ వృద్ధిరేటు 10.8 శాతంగా ఉందని, పన్నులు పెంచకుండానే అభివృద్ధి సాధ్యమని తాము నిరూపించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కేపీసీసీ ప్రెసిడెంట్ సన్నీ జోసెఫ్, కేరళ సీఎల్పీ నేత వీడీ సతీషన్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీప్ దాస్ మున్షీ, యూడీఎఫ్ కన్వీనర్ ఆదూర్ ప్రకాష్, ఐయూఎంఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి పీకే. కున్హాలికుట్టి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకో మండలంలో 'సమీకృత భూభారతి'

మొదటిపేజీ తరువాయి

కొన్ని మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. స్మార్ట్ ఫోన్ తో ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ లో లాగిన్ అయితే అన్ని సేవలు లభిస్తాయని అన్నారు. గత ప్రభుత్వ పాలకులు ప్రవేశపెట్టిన ధరణి కారణంగా రాష్ట్రంలో 9.52 లక్షల సాదాబైనామా దరఖాస్తులకు దిక్కులేకుండా పోయిందని, ఇప్పుడు ఈ పేదల ప్రభుత్వం దీనిపై దృష్టి సారించిందని తెలిపారు. సాగు చేస్తూ, వారి అధీనంలో ఉండే భూములకు సంబంధించి సదరు వ్యక్తి వద్ద కాన్సెంట్ తీసుకొని వారికే భూమి పట్టాను ఖరారు చేస్తామని, దీని కోసం వారం రోజుల క్రితం భూభారతిలో సవరణ చేస్తూ జీవో జారీ చేశామని వెల్లడించారు. అంతేగాక గతంలో గ్రామంగా ఉండి ఇప్పుడు మున్సిపాల్టీగా మారిన ప్రాంతాలకు ఈ సాదాబైనామాలు వర్తించేలా చేస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. ప్రజల కోసం తమ రెవెన్యూశాఖలో గణనీయమైన మార్పులు తెస్తున్నామని దీనిలో భాగంగా అక్రమాల ధరణిని చెప్పినట్లే బంగాళాఖాతంలో కలిపి భూభారతి తెచ్చామని, ఆధార్ నెంబర్‌లా ప్రతి భూమికి భూధార్ నెంబర్‌ను కేటాయిస్తామని చెప్పారు. అంతేగాక రాష్ట్రంలో 10.984 రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లు గా విభజించి జీపీవోలను నియమించడం జరిగిందన్నారు. 5300 మందికి రెండు విడతల్లో ఆరునెలల పాటు శిక్షణ ఇచ్చి మండలానికి 4 నుంచి 6 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించామని తెలిపారు.

అసెంబ్లీలో టెర్రరిస్టుల్లా ప్రవర్తించారు

పేదల సంక్షేమం కోసం ఇందిరమ్మ ప్రభుత్వ పనిచేస్తుంటే, గత ప్రభుత్వంలో అరాచకాలకు పాల్పడిన వ్యక్తులు ఇప్పుడు శాసనసభ సాక్షిగా విషం కక్కారని, టెర్రరిస్టుల్లా ప్రవర్తించారని మంత్రి పొంగులేటి ధ్వజమెత్తారు. ప్రతి ఎన్నికల్లో ఓడిపోయినా వారికి ఇంకా జ్ఞానోదయం కాలేదని అన్నారు. ఈ సందర్భంగా ఈ నియోజకవర్గ పరిధిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయ భవనాలకు త్వరలో తాను శంకుస్థాపన చేస్తానని మంత్రి పొంగులేటి ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి లోకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీలన్నీ అమలు చేయాల్సిందే

మొదటిపేజీ తరువాయి

తీవ్రస్థాయిలో విరుచుక పడుతూనే ఉన్నారు. విభజన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని గురువారం కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి గుర్తు చేశారు. విభజన హామీలన్నీ అమలు చేయాల్సిందేనని, ఇప్పటివరకు హామీలు ఎందుకు నెరవేర్చలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయనందుకు పరిహారం ఇవ్వాలని, 12 ఏళ్ల తర్వాత ఆస్తుల పంపకం పూర్తికాలేదని తెలిపారు.

ఆస్తుల పంపిణీపై కూడా..

ఆస్తుల పంపకంపై రెండు రాష్ట్రాలు సంతృప్తిగా లేవని రేణుకా చౌదరి తెలిపారు. ఏపీ, తెలంగాణ ప్రజలు కవలపిల్లల వంటివారని, కలిసే ముందుకు సాగక తప్పదని అన్నారు. తెలంగాణకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఆరోపించారు. బీజేపీతో సఖ్యత వల్ల ఏపీ కొంతవరకు సాధించుకుంటోందని, నాలుగైదు గ్రామాలు ఏ రాష్ట్రానికీ చెందకుండా పోయాయని గుర్తు చేశారు. భౌగోళికంగా ఏపీలో ఉన్నా ఆ గ్రామాలు ఇబ్బంది పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్ణీత కాలపరిమితితో విభజన హామీలు అమలు చేయాలని, పారదర్శక విధానంలో విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రూ. 1.47 లక్షల కోట్ల విభజన ఆస్తుల పంపకాలు పూర్తికాలేదని తెలిపారు. రెండు రాష్ట్రాలతో కేంద్రం ఆటలాడుతోందని, విభజన హామీలు అమలు చేయనందున 2 రాష్ట్రాల్లో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు.

హామీలు అమలు చేయాలని డిమాండ్ ..

కేసీఆర్ చేసిన ఎంతో పోరాటం వల్ల తెలంగాణ సాకారమైందని బీఆర్ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి అన్నారు. ప్రాంతాలుగా వేరవుదామని, అన్నదమ్ముల్లా కలిసుందాం అని కేసీఆర్ అన్నారని గుర్తు చేశారు. తెలంగాణ అనుమతి లేకుండానే కొన్ని మండలాలను ఏపీలో కలిపారని, తెలంగాణ మండలాలను ఏపీలో విలీనం చేసేటప్పుడు కనీసం చర్చ కూడా జరగలేదని ఆరోపించారు. తల్లిని చంపి బిడ్డను బతికించారని మోదీ అనేకసార్లు అన్నారని, ఏపీ విభజన బిల్లును ఏపీ పునర్నిర్మాణ బిల్లుగా చేయొద్దని డిమాండ్ చేశారు. 12 ఏళ్లుగా తెలంగాణకు కేంద్రం ఎలాంటి సహాయం చేయట్లేదని విమర్శించారు. కేంద్రం సహకరించకున్నా తెలంగాణ అభివృద్ధి చెందుతోందని తెలిపారు. ఇవాళ దేశంలోనే అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని గుర్తు చేశారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు కూడా హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సురేశ్‌రెడ్డి, కిషన్‌రెడ్డి మధ్య వాగ్వాదం..

రాజ్యసభలో కాళేశ్వరం అంశంపై సురేశ్‌రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మధ్య వాగ్వాదం జరిగింది. సీఆర్ పాటిల్ వ్యాఖ్యలపై సురేశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. సీఆర్‌పాటిల్ తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం గురించి కేంద్రమంత్రి ఏకపక్షంగా వ్యాఖ్యలు చేశారని సురేశ్‌రెడ్డి తెలిపారు. రూ.లక్ష కోట్లు నదిలో కొట్టుకుపోయాయని కేంద్రమంత్రి మాట్లాడారని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే కేవలం ఒక్క డ్యామ్ మాత్రమే కాదని, ఒక్క డ్యామ్‌లో రెండు పిల్లర్లు మాత్రమే కుంగితే మొత్తం ప్రాజెక్టు వృథా అన్నట్లుగా మాట్లాడారని అన్నారు. తెలంగాణతో పాటు ఏపీ కూడా అభివృద్ధి చెందాలని తాము కోరుకుంటున్నామని తెలిపారు. హైదరాబాద్ నగరం ఏపీ వాళ్లతో పాటు ఎంతోమందికి గమ్యస్థానంగా ఉందని పేర్కొన్నారు.

కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంగా కాళేశ్వరం..

సురేశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. మేడిగడ్డ ప్రాజెక్టు పనికిరాకుండా పోయిందని నిపుణుల కమిటీ చెప్పిందని, కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ కుటుంబం ఒక ఏటీఎంగా వాడుకున్నదని విమర్శించారు. కనీసం ఇంజినీర్లను కూడా అడగకుండా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని ఆరోపించారు. లక్ష కోట్ల ప్రజాధనాన్ని కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. కేసీఆర్‌ను జైల్లో పెడతానన్న రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు ఏం చేశారని ప్రశ్నించారు. ఆనాడు 7 మండలాల విలీనానికి కేసీఆర్ ఒప్పుకున్నారని, దస్త్రాలు పట్టుకుని సోనియాగాంధీ ఇంటికి కేసీఆర్ వెళ్లారని పేర్కొన్నారు

అమరావతికి రాజ్యసభలోనూ పచ్చజెండా

ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని అమరావతికి చట్టబద్ధత దిశగా కీలక ఘట్టం పూర్తయింది. లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లుకు రాజ్యసభ కూడా పచ్చజెండా ఊపింది. రాజ్యసభలో బిల్లుపై జరిగిన చర్చలో అమరావతికి తిరుగులేని మద్దతు దక్కింది. బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన సవరణ బిల్లును కేంద్రమంత్రి నిత్యానందరాయ్ రాజ్యసభలో ప్రవేశపెట్టారు. సభ్యుల సమ్మతితో రాజ్యసభ చైర్మన్ సి.పి.రాధాక్రిష్ణన్ బిల్లుపై చర్చకు ఆమోదం తెలిపారు. అమరావతికి చట్టబద్ధతకు కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, ఆప్, తృణమూల్, బీజేడీ, జేడీయూ, ఆర్జేడీ, బీఆర్ఎస్, ఉద్ధవ్ శివసేన పార్టీల ఎంపీలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలుగు ప్రజలందరికి ఇవాళ చరిత్రాత్మకమైన రోజు అని అన్నారు. "బిల్లు ప్రవేశపెట్టడాన్ని తెలుగు ప్రజలంతా గర్వంగా భావిస్తున్నారు. ప్రజా రాజధాని అమరావతి చరిత్రలో గుర్తుంటుంది. సంక్షోభాలను అవకాశాలుగా మలచుకోవడం మా నాయకుడు నేర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని గురించి ప్రజలకు స్పష్టత ఇస్తున్నాం. రాజధాని కోసం ఉద్యమించిన రైతులు, మహిళలకు సరైన న్యాయం దక్కింది. విభజన సమయంలో ఒక రాష్ట్రానికి రాజధాని ఉంది, మరో రాష్ట్రానికి లేదు' అని వెల్లడించారు.

అమెరికా లొంగేవరకు యుద్ధం

మొదటిపేజీ తరువాయి

సామర్థ్యాన్ని దెబ్బతీసినట్లు ట్రంప్ చేసిన ప్రకటనను ఖతమ్ అల్ అన్బియా కేంద్ర ప్రధాన కార్యాలయం అధికార ప్రతినిధి తోసిపుచ్చినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా ప్రెస్ టీవీ తెలిపింది. ఇరాన్ సైనిక బలంపై అమెరికా నిఘా అసంపూర్ణమని ఆయన వ్యాఖ్యానించారు. ఇస్లామిక్ రిపబ్లిక్ విశాల సామర్థ్యాల గురించి అమెరికాకు తెలియదని ఆయన చెప్పారు. క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించకుండా ఇరాన్‌ను నాటకీయంగా కట్టడి చేసినట్లు ట్రంప్ చేస్తున్న వాదనను ఆయన తోసిపుచ్చారు. మా సైనిక శక్తి, ఆయుధాలపై మీ నిఘా అసంపూర్ణం. మా విశాల వ్యూహాత్మక సామర్థ్యం గురించి మీకు ఏమీ తెలియదు. మా వ్యూహాత్మక క్షిపణి ఉత్పత్తి కేంద్రాలను ధ్వంసం చేశామని భ్రమపడవద్దు అని ఇరాన్ ప్రతినిధి స్పష్టం చేశారు. అమెరికానే దురాక్రమణకు పాల్పడిందని ఆరోపిస్తూ ప్రతీకార చర్యలు కొనసాగిస్తామని ప్రతినిధి హెచ్చరించారు. తమ దేశంపై ప్రారంభించిన దురాక్రమణకు మీరు మూల్యం చెల్లించాల్సిందేనని ఆయన అన్నారు.

ఇరాన్‌లోని ఐకానిక్ బ్రిడ్జి ధ్వంసం

పశ్చిమాసియాలో నిర్మాణంలో ఉన్న అతి ఎత్తయిన వంతెనను యూఎస్, ఇజ్రాయెల్ వైమానిక దళాలు దాడి చేసి కూల్చివేశాయి. ఇలాంటి దాడులు మరిన్ని తప్పవని హెచ్చరించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మంటల్లో ఉన్న కూలిన బ్రిడ్జి వీడియోను ట్రూత్ సోషల్‌లో ఉంచారు. ఆలస్యం కాకముందే తమతో ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరాన్‌ను హెచ్చరించారు. ఈ దాడిలో ఇద్దరు పౌరులు గాయపడ్డారు. ఇరాన్ రాజధాని టెహ్రాన్ పశ్చిమం నుంచి కారజ్ నగరాన్ని కలిపే ఈ బ్రిడ్జి ఎత్తు 136 మీటర్లు. పశ్చిమాసియాలో ఇంజినీరింగ్ అద్భుతంగా దీన్ని పేర్కొనేవారు.

ఇరాన్ ప్రతీకార దాడులు

జోర్డాన్‌లోని అల్ అజ్రాక్ స్థావరంలోని అమెరికా ఫైటర్ జెట్లపై తాము డ్రోన్ దాడి చేసినట్టు ఇరాన్ ప్రకటించింది. జోర్డాన్ బేస్‌లో అమెరికా విమానాలు నిలిపి ఉంచగా ఈ దాడి జరిగింది. అయితే విమానాలకు ఎంత నష్టం వాటిల్లినదీ వివరాలు తెలియరాలేదు. గల్ఫ్‌లో పౌర మౌలిక సదుపాయాలు లక్ష్యంగా తమ దాడులు కొనసాగినట్టు పేర్కొన్నది. తమ దాడులను మరింత విస్తరిస్తామని, అందులో భాగంగా, కువైట్, సౌదీ అరేబియా, అబుదాబి, జోర్డాన్‌లో పలు బ్రిడ్జిలు లక్ష్యంగా తమ మిలిటరీ దాడులు చేసే అవకాశం ఉందని తెలిపింది.

హోర్ముజ్‌ను తెరిపించేందుకు 35 దేశాల సమావేశం



హోర్ముజ్ జలసంధిని తెరిపించేందుకు 35 దేశాల ప్రతినిధులతో జరిగే బహుపాక్షిక చర్చల్లో పాల్గొనాలని యూకే నుంచి భారత్‌కు ఆహ్వానం అందినట్టు విదేశాంగ శాఖ గురువారం వెల్లడించింది. గురువారం సాయంత్రం ప్రారంభమైన ఈ సమావేశానికి భారత్ నుంచి విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ హాజరయ్యారని ఆ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, హోర్ముజ్ ప్రతిష్ఠంభన, దానిని తెరిపించేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి సమావేశంలో చర్చిస్తారని తెలిపారు.

రాష్ట్రీయం

నోరు తెరిస్తే నోట్లోకి దోమలు వెళ్తున్నాయి

- దోమలతో నగర ప్రజలు నరకయాతన
- ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి 'వినూత్న నిరసన'
- దోమల తెర వేసుకొని మీడియా సమావేశం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్2 : రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగరం దోమల నగరంగా మారిందంటూ ఎల్బీనగర్ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి వినూత్న తరహాలో నిరసన వ్యక్తం చేశారు. దోమలతో హైదరాబాద్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, నోరు తెరిస్తే నోట్లోకి దోమలు వెళ్తున్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. నగరంలో దోమల బెడద తీవ్రంగా ఉన్నప్పటికీ రాష్ట్రప్రభుత్వం, జీహెచ్ఎంసీ కనీసం ఆ సమస్యను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దోమతెర ధరించి అసెంబ్లీలోని మీడియా హాల్లో మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మీడియా సమావేశం కోసం అసెంబ్లీకి ఫాగింగ్ యంత్రం, ఇతర సామగ్రితో వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వాటిని లోపలికి తీసుకెళ్లేందుకు అనుమతి లేదని మార్షల్స్ అడ్డుకున్నారు. దీంతో ఆయన సమావేశాలు లేకపోయినా ఈ కొత్త నిబంధనలు ఎక్కడివని మార్షల్స్‌తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దోమల బెడద లేకుండా నాలుగు, ఐదు సార్లు చర్యలు ఉండేవన్న ఆయన దోమల బెడదపై ఈ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆక్షేపించారు.

దోమలను అరికట్టలేని ప్రభుత్వం అవసరమా?

డెంగ్యూ, మలేరియా వంటి రోగాలతో పేద ప్రజలు ఆసుపత్రి పాలవుతున్నారని, దోమలు అరికట్టలేని ఈ ప్రభుత్వం అవసరమా? అని ప్రజలు భావిస్తున్నారని సుధీర్ రెడ్డి చెప్పుకొచ్చారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నపుడు మాత్రమే కొన్ని నిబంధనలు ఉంటాయని, దోమల బెడదపై అసెంబ్లీ మీడియా హాల్లో మాట్లాడదామని ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసుకుంటే మార్షల్స్ అడ్డుకున్నారని మండిపడ్డారు.

నివారణకు చర్యలు తీసుకోవాలి ...

దోమల బెడదకు భయపడి ఎవరూ హైదరాబాద్ రావడం లేదని, ఇక్కడి నుంచి పారిపోతున్నారని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్లో దోమల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని, లేదంటే హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కు మరింత నష్టం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రెండేళ్లలో కాంగ్రెస్ పార్టీ ఏం సాధించిందని సంబరాలు చేసుకుంటున్నారని ప్రశ్నించారు. హైదరాబాద్ ప్రజలు దోమ తెర కుట్టించుకునే పరిస్థితికి పూర్తి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. కరోనా వచ్చినప్పుడు మాస్కులు పెట్టుకున్నట్లే హైదరబాద్‌లో దోమల బెడద తట్టుకోలేక దోమతెర కుట్టించుకునే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

హైదరాబాద్ వాసులను కాపాడండి ...

హైదరాబాద్ నగరాన్ని మూడు ముక్కలు చేసి మరిన్ని సమస్యలకు కారణమయ్యారని సుధీర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దోమల బెడదతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు మరింత నష్టం కలుగుతుందన్న ఆయన ప్రతి డివిజన్‌కు 10 ఫాగింగ్ యంత్రాలు ఇవ్వాలని కోరారు. దోమలను అరికట్టండి హైదరాబాద్ వాసులను కాపాడండి అని విజ్ఞప్తి చేశారు.



పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలి

- ఏర్పాట్లపై కవిత ఆధ్వర్యంలో సమావేశం
- బంజారాహిల్స్‌లో జాగృతి నేతలతో భేటీ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్ 2: బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో గురువారం జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ముఖ్య నాయకులతో సమావేశం జరిగింది. ఈనెల 25న మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో నిర్వహించనున్న పార్టీ ఆవిర్భావ సభ ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చే నాయకులు, కార్యకర్తల కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లపై దృష్టి సారించారు. వారికి వసతి, రవాణా, భోజన ఏర్పాట్లు వంటి అంశాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు బాధ్యతలను విభజించారు. అలాగే సభకు ముందు నిర్వహించాల్సిన కార్యక్రమాలు, సభ అనంతరం చేపట్టే చర్యలపై కూడా స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ప్రతి జిల్లాలోని నాయకులు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతం చేయాలని సూచించారు. పార్టీ ఆవిర్భావ సభను భారీ స్థాయిలో నిర్వహించాలని, ప్రజల్లో మంచి స్పందన రాబట్టేలా కార్యాచరణ ఉండాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



బహుజన రాజ్యస్థాపకుడు సర్వాయి పాపన్న

- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన మంత్రి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్2: తెలంగాణ గర్వకారణమైన, ప్రజల హక్కుల కోసం పోరాడిన మహావీరుడు, బహుజన రాజ్యస్థాపకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఘన నివాళులు అర్పించారు. పాపన్న గౌడ్ సామాన్య ప్రజల కోసం,ముఖ్యంగా అణగారిన వర్గాల కోసం తన ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన మహానుభావుడని పేర్కొన్నారు. ఆయన స్థాపించిన బహుజన రాజ్యస్థాపన చేసి స్వరాజ్య భావన, సమానత్వం కోసం చేసిన పోరాటం నేటి తరాలకు మార్గదర్శకమని అన్నారు. ప్రజా పాలన ప్రభుత్వం బీసీ వర్గాల అభ్యున్నతి కోసం కట్టుబడి పనిచేస్తోందని, పాపన్న గౌడ్ స్ఫూర్తితోనే పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు.

నేటి నుంచి టీపీసీసీ చీఫ్ జిల్లాల పర్యటన

- నాలుగు జిల్లాల్లో డీసీసీ కార్యవర్గ సమావేశాలు
- పార్టీ బలోపేతంపై మహేష్‌గౌడ్‌దృష్టి



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్ 2: టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నేటి నుంచి రెండు రోజులపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా నాలుగు జిల్లాల్లో డీసీసీ కార్యవర్గ సమావేశాలు జరుగన్నాయి. పార్టీ సంస్థాగత బలోపేతం, విస్తరణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం ప్రధాన అజెండాగా ఈ పర్యటన కొనసాగనుంది. శుక్రవారం ఉదయం 10 గంటలకు మంచిర్యాల జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షులు రఘునాథ రెడ్డి అధ్యక్షతన జరిగే జిల్లా కార్యవర్గ సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఈ సమావేశానికి జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి వివేక్, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు హాజరుకానున్నారు. మంచిర్యాల సమావేశం అనంతరం మహేష్ కుమార్ గౌడ్ అసిఫాబాద్ జిల్లాకు పర్యటించనున్నారు. అక్కడ డీసీసీ అధ్యక్షులు ఆత్రం సుగుణ అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో పాల్గొని పార్టీ పరిస్థితులపై సమీక్ష చేయనున్నారు. శనివారం ఉదయం ఆదిలాబాద్ జిల్లాలో డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్ ఆధ్వర్యంలో జరిగే కార్యవర్గ సమావేశానికి హాజరవుతారు. అనంతరం నిర్మల్ జిల్లాకు వెళ్లి, డీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్యే బొజ్జు అధ్యక్షతన జరిగే సమావేశంలో పాల్గొనన్నున్నారు. ఈ పర్యటనలలో భాగంగా జిల్లాల వారీగా కాంగ్రెస్‌పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడం, కార్యకర్తలతో సమీక్షలు నిర్వహించడం, పార్టీని గ్రామ స్థాయికి మరింత విస్తరించే కార్యాచరణపై చర్చలు జరపనున్నారు. అదే విధంగా రాష్ట్రప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే విధానంపై దిశానిర్దేశం చేయనున్నారు. ముఖ్యంగా గత రెండేళ్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రివర్గం అమలు చేసిన ప్రజాపాలన, సంక్షేమ పథకాల ఫలితాలను ప్రజలకు వివరించేందుకు కార్యాచరణ రూపొందించనున్నారు. ఈ పర్యటనలతో జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీకి మరింత ఊపొస్తుందని నాయకులు భావిస్తున్నారు.



పుదుచ్చేరిలో పొన్నం, భట్టి ప్రచారం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్2: కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పుదుచ్చేరి ఎన్నికల సభల నిర్వహణ, ఎన్నికల వ్యూహంపై స్థానిక నేతలతో కలిసి గురువారం పుదుచ్చేరి ఏఐసీసీ, పుదుచ్చేరి ముఖ్య నేతలతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశం అయ్యారు.

గ్రామీణాభివృద్ధికి కేంద్రం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది

- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి
- గ్రామ పంచాయతీ నిధుల విడుదలపై హర్షం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్ 2: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు 2025-26 సంవత్సరానికి సంబంధించిన మొదటి విడత నిధులు విడుదలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీల కోసం రూ.619.85 కోట్లు విడుదల చేయడాన్ని స్వాగతించారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్' మంత్రాన్ని అక్షరాలా ఆచరణలో పెడుతూ ప్రతి గ్రామం సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తోందన్నారు. కేంద్రం విడుదల చేసిన రూ.619.85 కోట్ల నిధుల్లో రూ.371.91 కోట్లు టైడ్ గ్రాంట్, రూ.247.94 కోట్లు అన్ టైడ్ గ్రాంట్ కింద ఉన్నాయన్నారు. టైడ్ గ్రాంట్ నిధులతో గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, వర్షపు నీరు సంరక్షణ, ప్రజల జీవన ప్రమాణాల పెంపు వంటి అనేక పనులు చేయవచ్చన్నారు. అన్ టైడ్ గ్రాంట్ నిధులను మాత్రం స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రామ సభల్లో నిర్ణయం తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టుకోవచ్చని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.

కేంద్రం ఇచ్చిన నిధులను కూడా పక్కదారి పట్టించారు

రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించని కారణంగా.. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన నిధులను ఇటీవల గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరిగిన తర్వాత కేంద్రం విడుదల చేసిందని తెలిపారు. తాజాగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి విడత నిధులను కూడా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు గ్రామపంచాయతీలకు నిధులు ఇవ్వకుండా, కేంద్రం ఇచ్చిన నిధులను కూడా పక్కదారి పట్టించాయి. అయినప్పటికీ.. గ్రామాల అభివృద్ధికోసం కేంద్రం యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించగానే.. నిధులను విడుదల చేసిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలను రేండెళ్లపాటు నిర్వహించకుండా స్పెషల్ ఆఫీసర్ల పాలనతో రాష్ట్ర ప్రభుత్వం నెట్టుకొచ్చిందని,. ఇకపై కూడా.. ఎప్పటికప్పుడు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పిస్తే తదనుగుణంగా నిధులను విడుదల చేసేందుకు కేంద్రప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.





ఎఫ్‌సీడీఏ భవన పనులు వేగవంతం చేయండి

- ఫ్యూచర్ సిటీ పనులు పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్2: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం (ఎఫ్‌సీడీఏ), యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ కి సంబంధించిన భవన సముదాయాల నిర్మాణ పురోగతిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఫ్యూచర్ సిటీ అథారిటీ భవన నిర్మాణ పనులతో పాటు ఆ ప్రాంత రూపకల్పనలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే, స్కిల్స్ యూనివర్సిటీకి చెందిన పలు భవనాలను పరిశీలించి, పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి వెంట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సుబ్బారావు, ఇతర అధికారులు ఉన్నారు.

క్రైస్తవులకు సీఎం రేవంత్ గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్2: తెలంగాణలోని క్రైస్తవ సోదరులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యేసు క్రీస్తు త్యాగం, ధైర్యం సీఎం గుర్తు చేసుకున్నారు. యేసు ప్రభు ప్రేమ, కృప కటాక్షాలు ఎల్లప్పుడూ ప్రజలపై ఉండాలని అభిలాషించారు. శాంతి, కరుణ సందేశాలతో పాటు క్రీస్తు నేర్పిన సేవ, దయ, సోదరభావం ఇప్పటికీ ఎప్పటికీ మానవాళికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రపంచానికి ప్రేమతత్వం బోధించిన దయామయుడు, సిలువపై యేసుక్రీస్తు త్యాగం మహోన్నతమైనదని 'గుడ్ ఫ్రైడే' సందేశం సందర్భంగా సీఎం వెల్లడించారు. యేసు క్రీస్తు త్యాగాలకు జ్ఞాపకంగా జరుపుకునే గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవ సోదర సోదరీమణులందరూ ఘనంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

డోర్నకల్- గద్వాల కొత్త రైల్వే లైన్ కోసం పాదయాత్ర

- నాగర్ కర్నూల్ వెనకబడ్డ ప్రాంతం.. రైల్వే నెట్‌వర్క్ ఎంతో అవసరం
- కల్వకుర్తి – -మాచర్ల రైల్వే లైన్ అభివృద్ధికి లైఫ్ లైన్
- నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి



ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, ఏప్రిల్2: డోర్నకల్ - గద్వాల కొత్త రైల్వే లైన్ కోసం పాదయాత్ర చేస్తానని నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి ప్రకటించారు. నాగర్ కర్నూల్ వెనకబడ్డ ప్రాంతం అని, రైల్వే నెట్ వర్క్ ఎంతో అవసరం ఉందని వ్యాఖ్యానించారు. కల్వకుర్తి మాచర్ల రైల్వే లైన్ ఏర్పాటు చేస్తే, రెండు తెలుగు రాష్ట్రాలకు ఉపయోగంగా ఉంటుందని వివరించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఎంపీ మల్లు రవి విలేఖరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కీలక కామెంట్స్ చేశారు. 'నేను మూడోసారి ఎంపీ అయిన తర్వాత, డోర్నకల్ నుంచి గద్వాల వరకు కొత్త రైల్వే లైన్ గురించి ప్రతి పార్లమెంట్ సెషన్‌లో మాట్లాడా. రైల్వే మంత్రికి విజ్ఞప్తులు చేశా. మన ముఖ్యమంత్రి ద్వారా రైల్వే మంత్రికి లేఖ రాయించా. ఇలా అనేకసార్లు జరిగాయి.' అని అన్నారు. ఇటీవల కూడా రైల్వే మంత్రిని వారి కార్యాలయంలో కలిశామని, డోర్నకల్‌గద్వాల్ రైల్వే లైన్ గురించి గుర్తుచేశానని అన్నారు. ఈ లైన్ నాగర్ కర్నూలు జిల్లాకి లైఫ్ లైన్ లాంటిదని వివరించానని చెప్పారు. ఇవాళ కూడా రైల్వే బోర్డు డైరెక్టర్ అభిషేక్‌ను కలిసినట్లు చెప్పారు. ఈ రైల్వే లైన్ కోసం సర్వే చేసిన మ్యాప్, సౌత్ సెంట్రల్ రైల్వే రైల్వే బోర్డు పంపించిన డీపీఆర్‌ను తీసుకున్నానని చెప్పారు. వారం, పది రోజుల్లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ట్రాఫిక్) ఇంకా మిగిలిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ తో సమావేశం ఏర్పాటు చేసి, పూర్తిస్థాయి డీపీఆర్ సిద్ధం చేసి.. కేబినెట్‌కు పంపించే ప్రక్రియను మొదలు పెడతామని రైల్వే బోర్డు డైరెక్టర్ చెప్పినట్లు తెలిపారు. త్వరలోనే ఇరువీన్ గ్రామం నుంచి పాదయాత్ర మొదలుపెట్టి, శ్రీరామ్ నగర్ వరకు ప్రతిపాదిత రైల్వే లైన్ మార్గంలో కొనసాగిస్తానని తెలిపారు. ఈ రైల్వే లైన్‌ను వీలైనంత త్వరగా ప్రారంభించి, పూర్తి చేయాలని రైల్వే మంత్రిత్వ శాఖ పై ఒత్తిడి తేవడానికే పాదయాత్ర చేయబోతున్నట్లు చెప్పారు. కల్వకుర్తి, వనపర్తి, నాగర్ కర్నూల్, గద్వాల ఎమ్మెల్యేలతో, స్థానిక నాయకులతో, ప్రజలతో కలిసి త్వరలోనే పాదయాత్రను ప్రారంభించబోతున్నట్లు తెలిపారు.



మహిళా సంఘాల భవనాల నిర్మాణం వేగవంతం

- 6,261 భవనాలకు అనుమతులు, 5,017కు అంచనాలు సిద్ధం
- యాదాద్రి భువనగిరి జిల్లా సర్వేపల్లిలో తొలి భవనం ప్రారంభం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్ 2: రాష్ట్రంలో గ్రామీణ మహిళల సాధికారతకు బలమైన మౌలిక వసతులు కల్పించే దిశగా మహిళా సంఘాల భవనాల నిర్మాణం శరవేగంగా కొనసాగుతోంది. ఇందిరా మహిళా శక్తి పథకం కింద ఈ కార్యక్రమం యజ్ఞంలా గ్రామాలన్నింటిలో అమలు అవుతూ మరో మైలురాయిగా నిలువనుంది. ప్రతి గ్రామ పంచాయతీలో మహిళా భవనాల నిర్మాణానికి కనీసం 200 గజాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాలతో 12,728 గ్రామ పంచాయతీలు ఉండగా, ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8,193 స్థలాలను అధికారులు గుర్తించారు. అందులో 6,261 భవనాలకు కలెక్టర్ల నుంచి అనుమతులు లభించగా, 5,017 భవనాల నిర్మాణాలకు అంచనాలు సిద్ధం అయ్యాయి. ప్రస్తుతం జిల్లాల వారీగా పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మంత్రి సీతక్క నిత్య పర్యవేక్షణలో, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ దివ్యా దేవరాజన్ ప్రత్యేక చొరవతో సెర్ప్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మధ్య సమన్వయానికి ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేయడం వల్ల స్థలాల గుర్తింపు నుంచి అనుమతులు, అంచనాలు, నిర్మాణం వరకు అన్ని దశల్లో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రజాపాలన -ప్రగతి ప్రణాళికలో భాగంగా ములుగు జిల్లాలో పలు గ్రామాల్లో మంత్రి సీతక్క మహిళా భవనాలకు శంకుస్థాపనలు చేశారు. అలాగే యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆత్మకూరు మండలం సర్వేపల్లి గ్రామంలో మహిళా భవనాల భవనం ప్రారంభమైంది. రంగారెడ్డి జిల్లాలో కేశంపేట మండలం ఆల్వాల్ గ్రామ పంచాయతీలో కూడా భవనం పూర్తయింది.

ఆర్థిక, సామాజిక బలోపేతానికి కేంద్రాలుగా మహిళా భవనాలు-: మంత్రి సీతక్క

ప్రతి గ్రామంలో మహిళలకు బలమైన వేదిక కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి సీతక్క అన్నారు. మహిళా సంఘాల భవనాలు వారి ఆర్థిక, సామాజిక బలోపేతానికి కేంద్రాలుగా మారతాయని, మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించుకోవడానికి, ఒకచోట చేరి నిర్ణయాలు తీసుకునే వేదికగా ఇవి ఉపయోగపడతాయని, నిర్దిష్ట కాలంలో భవనాల నిర్మాణాన్ని పూర్తి చేసి మహిళలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు.



అమరావతిపై వైసీపీకి ఇప్పటికీ జ్ఞానోదయం కలగలేదు. అసెంబ్లీలో తీర్మానం పెడితే రాలేదు. కనీస జ్ఞానముండే వ్యక్తి అయితే రావాలి. పార్లమెంటులో అమరావతిని వ్యతిరేకించిన ఏకైక పార్టీ వైసీపీ. ఆ పార్టీ పేరు పలకాలా? ప్రజలంతా ఇక దాన్ని మరిచిపోవాలి. ఈ రాష్ట్రానికి వైసీపీ పీడ విరగడవ్వాలి. మావిగన్ ఏంటో అర్థం కాలేదు, డిక్షనరీలోనూ లేదు.
- ఏపీ సీఎం చంద్రబాబు.

ఆస్తి విషయంలో ఆమె నిర్ణయమే అంతిమం!


ఆధునిక సమాజంలో మహిళా సాధికారతకు అసలైన అర్థం ఆమె ఆర్థిక స్వాతంత్ర్యం. భారతీయ సమాజంలో వివాహం అనేది కేవలం ఇద్దరు వ్యక్తుల కలయిక మాత్రమే కాదు, రెండు కుటుంబాల ఆర్థిక ప్రయాణం కూడా. నేటి ఆధునిక కాలంలో చాలా వరకు భార్యాభర్తలిద్దరూ సంపాదిస్తున్నారు. ఉమ్మడి లక్ష్యాల కోసం కలిసి ఆస్తులు కొంటున్నారు. అయితే, దురదృష్టవశాత్తూ ఆ బంధం విడాకుల వరకు వెళ్తే.. మరి వారు ఇద్దరూ కలిసి కొనుగోలు చేసిన ఆస్తి ఎవరిది? అనే ప్రశ్న వివాదంగా మారుతోంది. ఇటీవల '1 ఫైనాన్స్' నిర్వహించిన అధ్యయనం ప్రకారం, విడాకులు తీసుకున్న వారిలో 67 శాతం మంది తాము విడిపోకముందే తీవ్రమైన ఆర్థిక విభేదాలు ఎదుర్కొన్నట్లు తేలింది. అంతేకాకుండా, 43 శాతం కేసుల్లో విడాకులకు ప్రధాన కారణం ఆర్థిక సమస్యలే కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో వైవాహిక ఆస్తుల యాజమాన్యంపై చట్టం ఏం చెబుతోంది? ఇటీవల తెలంగాణ హైకోర్టు ఇచ్చిన కీలక తీర్పు ప్రాధాన్యత ఏమిటి? అనే అంశాలను చూద్దాం. టైటిల్ డీడ్ వర్సెస్ కంట్రిబ్యూషన్: చట్టం ఏం చెబుతోంది? 1955 హిందూ వివాహ చట్టం ప్రకారం, ఆస్తి ఎవరి పేరు మీద ఉంటే వారే యజమాని అనేది ప్రాథమిక సూత్రం. కేవలం పెళ్లి చేసుకున్నంత మాత్రాన భర్త ఆస్తిలో భార్యకు లేదా భార్య ఆస్తిలో భర్తకు సగం వాటా దానంతట అదే రాదు. ఇటీవల అమిష్ అగర్వాలా కేసులో తెలంగాణ హైకోర్టు ఒక స్పష్టమైన తీర్పునిచ్చింది. భర్త పేరు మీద ఉన్న నివాస ఆస్తిలో తనకూ వాటా కావాలని భార్య కోరగా కోర్టు దాన్ని తోసిపుచ్చింది. 'వివాహం జరిగినంత మాత్రాన స్థిరాస్తిపై ఉమ్మడి యాజమాన్యం ఏర్పడదు' అని కోర్టు స్పష్టం చేసింది. ఆస్తి కొనుగోలులో తమ ఆర్థిక భాగస్వామ్యం ఉందనడానికి బ్యాంకు స్టేట్ మెంట్లు వంటి పక్కా ఆధారాలు చూపాలని న్యాయస్థానం పేర్కొంది. వినీతా సక్సేనా కేసు మినహాయింపు. సుప్రీంకోర్టు కొన్ని సందర్భాల్లో దీనిపై విభిన్నంగా స్పందించింది. వినీతా సక్సేనా వర్సెస్ పంకజ్ పండిట్ (2006) కేసులో ఆస్తి భర్త పేరు మీద ఉన్నప్పటికీ భార్యకు అనుకూలంగా తీర్పు వచ్చింది. గృహిణిగా ఆమె అందించిన సేవలు, ఇంటి నిర్వహణలో ఆమె పడిన శ్రమను 'పరోక్ష సహకారం'గా గుర్తించి హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 27 కింద ఆమెకు హక్కు కల్పించింది. నేటికీ చాలామందిలో ఆస్తి విషయంలో కొన్ని తప్పుడు అవగాహనలు ఉన్నాయి. 1 ఫైనాన్స్‌లో విల్, ఎస్టేట్ ప్లానింగ్ హెడ్ శ్రద్ధా నీలేశ్వర్ కొన్ని కీలక విషయాలను వివరించారు. తాను తెలిపిన వివరాలు కింది విధంగా ఉన్నాయి. పెళ్లయ్యాక కొన్న ఆస్తిలో భాగస్వామికి ఆటోమేటిక్‌గా 50% వాటా రాదు. 'షమీమా ఫరూకీ వర్సెస్ షాహిద్ ఖాన్ (2015)' కేసు ప్రకారం, ఆస్తిలో నివసించే హక్కు మాత్రమే ఉంటుంది తప్ప, పూర్తి యాజమాన్య హక్కులు ఉండవు. చాలామంది పన్ను ఆదా కోసం ఒకరి పేరు మీదనే ఆస్తులు కొంటారు, కానీ విడాకుల సమయంలో ఇది రెండో వ్యక్తికి చట్టపరమైన ఇబ్బందులు కలిగిస్తోంది. తాజాగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వెలువరించిన ఒక తీర్పు ఈ విషయాన్ని మరోసారి ఘంటాపథంగా నొక్కి చెప్పింది. "భార్యకు పుట్టింటి నుండి వచ్చిన ఆస్తిపై భర్తకు ఎలాంటి చట్టబద్ధమైన హక్కు ఉండదు" అని స్పష్టం చేస్తూ, మహిళల ఆత్మగౌరవానికి మరియు ఆస్తి హక్కులకు న్యాయస్థానం ఒక గట్టి రక్షణ కవచాన్ని నిర్మించింది.ఈ కేసులో హైకోర్టు ధర్మాసనం అత్యంత కీలకమైన అంశాలను ప్రస్తావించింది. మహిళలు తమ పుట్టింటి (తల్లిదండ్రుల) నుండి వారసత్వంగా పొందిన ఆస్తిపై పూర్తి నియంత్రణ కలిగి ఉంటారని తేల్చి చెప్పింది.ఆ ఆస్తిని ఎవరికి ఇవ్వాలి? ఎప్పుడు అమ్మాలి? ఎవరికి బహుమతిగా ఇవ్వాలి? అనే నిర్ణయం కేవలం ఆ మహిళదే. ఈ ప్రక్రియలో భర్త అనుమతి గానీ, సమ్మతి గానీ అవసరం లేదు. వివాహం జరిగినంత మాత్రాన భార్య ఆస్తిపై భర్తకు సహజసిద్ధమైన హక్కులు లభించవు. హిందూ వారసత్వ సవరణ చట్టంలోని సెక్షన్ 15(2)(a) ప్రకారం, ఒక మహిళకు ఆమె పుట్టింటి నుండి వచ్చిన ఆస్తి, ఆమెకు సంతానం లేని పక్షంలో తిరిగి ఆమె తండ్రి వంశానికే చెందాలి తప్ప అత్తగారింటికి కాదు.ఈ వివాదం ఒక ఆసక్తికరమైన మలుపు నుండి మొదలైంది. ఒక మహిళ తనకు తన తల్లిదండ్రుల నుండి వచ్చిన ఆస్తిని తన మనవరాలికి ఇష్టపూర్వకంగా రాసిచ్చింది. అయితే, "భార్య ఆస్తిలో భర్తగా నాకు వాటా ఉండాలి" అంటూ ఆమె భర్త కోర్టు మెట్లు ఎక్కారు. భార్య ఆస్తిపై భర్తకు హక్కు ఉంటుందనే పాతకాలపు ఆలోచనా ధోరణిని హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఆస్తి ఏ మూలాల నుండి వచ్చిందో, ఆ వంశ గౌరవాన్ని కాపాడటమే చట్టం ఉద్దేశమని కోర్టు స్పష్టం చేసింది ఈ తీర్పు కేవలం ఒక చట్టపరమైన నిర్ణయం మాత్రమే కాదు, ఇది మహిళల 'ఆర్థిక సార్వభౌమాధికారం' పై వేసిన ముద్ర."మహిళ కేవలం ఇంటిని నడిపే గృహిణి మాత్రమే కాదు.. తన ఆస్తిని పాలించే రాణి కూడా!" పుట్టింటి ఆస్తిని భర్త పేరు మీద మార్చాలని ఒత్తిడి చేసే వారికి ఈ తీర్పు ఒక హెచ్చరిక. అత్తగారింటి వేధింపులకు, బలవంతపు ఆస్తి బదిలీలకు ఈ తీర్పు ఒక శాశ్వత పరిష్కారంగా నిలవనుంది.ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఈ ప్రగతిశీల తీర్పు న్యాయ చరిత్రలో ఒక మైలురాయి. ఇది ఉమెన్ పవర్ కు దక్కిన అసలైన విజయం! ఇకపై మహిళా వారసత్వ ఆస్తి విషయంలో ఆమె మాటే శాసనం.. ఆమె నిర్ణయమే అంతిమం!

ప్రతిపక్షం

హైదరాబాద్

శుక్రవారం
03.04.2026

యుద్ధం సృష్టిస్తున్న సంక్షోభం–ప్రభావం



నర్ర భగవాన్ రెడ్డి
9492913165

అమెరికా, ఇజ్రాయిల్ ఇరాన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధ చర్యలు, వాటితో సంభవించే విపత్కర పరిస్థితుల పట్ల ప్రపంచంలోని ఇతర దేశాలన్నీ ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. యుద్ధం వద్దు శాంతి కావాలంటూ కోరుతున్నారు. గతంలో జరిగిన రెండు ప్రపంచ యుద్ధాల దుష్ఫలితాలు ప్రపంచ చరిత్రలో నెత్తుటి మరకలుగా మారిన అనుభవాలు ప్రపంచం ముందు ఉన్నాయి. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత శాంతి స్థాపన కోసం నానాజాతి సమితి ఏర్పడింది. ఆయా రాజ్యాల ప్రతీకార చర్యలను ఆపడంలో నానా జాతి సమితి విఫలం చెందింది. ఫలితంగా రెండో ప్రపంచ యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో జపాన్ లోని హిరోషిమా, నాగాసాకి పట్టణాలపై అమెరికా చేసిన అణ్వాయుధాల దాడి సృష్టించిన విలయం నుండి కోలుకోవడానికి చాలా కాలం పట్టింది. ఏళ్ల తరబడి కొనసాగిన యుద్ధంతో ప్రపంచంలో సంక్షోభం ఏర్పడింది. ఈ నేపథ్యంలో వివిధ దేశాల మధ్య జరిగిన చర్చల ఫలితంగా శాంతి కోసం ఐక్యరాజ్యసమితి ఏర్పడింది. స్వాతంత్ర్య ఉద్యమాల ద్వారా చాలా దేశాలు స్వతంత్ర దేశాలుగా అవతరించాయి. ఆనాటికి ఈనాటికి ప్రపంచ వ్యాప్తంగా రాజకీయంగా, శాస్త్ర సాంకేతిక, సైనిక, పారిశ్రామిక రంగాల్లో ఎన్నో పరిణామాలు చోటు చేసుకున్నాయి. అగ్ర రాజ్యాలుగా అవతరించిన రష్యా, అమెరికాలు భిన్న ధృవాలు మారి ప్రచ్ఛన్న యుద్ధ పరిస్థితులు ఆందోళన కలిగించాయి. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తర్వాత ఏక ధృవ ప్రపంచంగా మారిన పరిస్థితుల్లో అగ్రరాజ్యమైన అమెరికా అన్ని దేశాలకు పెద్దన్నగా వ్యవహరిస్తూ ఆయా దేశాల వ్యవహారాల్లో జోక్యం చేసుకోసాగింది. తమ ఆధీనంలో లేని దేశాలపై దాడులు చేయడం సాధారణమైపోయింది.

ఇరాన్ పై అమెరికా దాడితో యుద్ధం

మధ్య ప్రాచ్యంలోని దేశాలలో భిన్న మైన జీవన స్థితిగతులు, విశ్వాసాలు ఉన్నాయి. 11 శతాబ్దం నుండి 13వ శతాబ్దం వరకు క్రూసేడుల పేరుతో మత యుద్ధాలు జరిగాయి. ఇజ్రాయిల్, పాలస్తీనా, ఇరాన్ దేశాల మధ్య వైరుధ్యాలు ఉన్నాయి. పశ్చిమాసియా దేశాల్లో భిన్నమైన విశ్వాసాలు, పరస్పర రాజకీయ వ్యూహాలతో ఎప్పుడేమి జరిగినా ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనే వాతావరణం ఉంది. ఈ క్రమంలో అమెరికా ఇతర దేశాల్లో జోక్యం చేసుకుంటోంది. ఈ క్రమంలో మాదక ద్రవ్యాల నెపంతో వెనిజులాపై దాడి చేసి ఆ దేశ అధ్యక్షుడు మధురోహాను బంధించింది. ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ ను హత మార్చింది. ఉగ్ర వాద నాయకుడు ఒసామా బిన్ లాడెన్ ను హతమార్చడం అమెరికాకే చెల్లింది. అమెరికాకు మిత్ర దేశమైన ఇజ్రాయిల్ కు ఇరాన్ పక్కలో బల్లెంగా మారింది. అణ్వాయుధాల తయారీలో అమెరికా హెచ్చరికను ఇరాన్ బేఖాతరు చేసింది. దీంతో అదును చూసి అమెరికా , ఇజ్రాయిల్ లు సంయుక్తంగా ఇరాన్ పై దాడిచేసి ఆ దేశ సుప్రీం కమాండర్ ఖమేనీని హత మార్చాయి. ఈ దాడులతో దిగి వస్తుందనుకున్న ఇరాన్ ఊహకందని విధంగా ప్రతి దాడులకు దిగడంతో యుద్ధంగా మారింది. బాలిస్టిక్ క్షిపణులు, మిస్సైల్స్, ఏర్ క్రాఫ్ట్ లు, డ్రోన్లు, యుద్ధ విమానాలతో పరస్పరం దాడులకు పాల్పడుతున్నారు. ఇరువైపులా జరుగుతున్న విధ్వంస కాండతో పరిస్థితులు సంక్షోభంలోకి జారుకున్నాయి. ఖమేనీని హత మారిస్తే ఇరాన్ లో తమకు అనుకూల ప్రభుత్వాన్ని గద్దె మీద కూర్చోబెట్టవచ్చని అమెరికా, ఇజ్రాయిల్ చేసిన ప్రయత్నాలను ఇరాన్ భగ్నం చేయడమే కాకుండా ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. సవాల్ కి ప్రతి సవాల్ విసురుతోంది. ప్రపంచంలో ఇరవై శాతం చమురు సరఫరా జరిగే హార్మోజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధం చేసింది. దీంతో చమురు సంక్షోభంతో పాటు ఆర్థిక సంక్షోభం ఏర్పడే పరిస్థితులు ప్రపంచ దేశాలను



ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఖర్గు ద్వీపాన్ని ఆక్రమించి ఇరాన్ ను కట్టడి చేయడానికి అత్యంత పటిష్టమైన అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సైన్యాన్ని ఇరాన్ భూతలంపై దింపాలని అమెరికా వ్యూహం పన్ని ఇరాన్ కు హెచ్చరిక పంపింది. దీనికి ప్రతిగా ఇరాన్ వెల్కమ్ టు హెల్ అంటూ దీటుగా స్పందించింది. అంటే అమెరికా సైన్యం తమపై దాడులు చేయడానికి దిగితే శవాలను శవ పేటికలలో పెట్టి పంపడానికి సిద్ధంగా ఉన్నట్లు హెచ్చరించింది. ఇలాంటి వ్యూహాలు ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్తతలకు గురిచేస్తున్నాయి. నెల రోజులు దాటుతున్నా యుద్ధం ముగిసే ఛాయలు కనబడక పోగా పరస్పరం దాడులు మరింత ముమ్మరం కావడంతో ప్రాంతీయ యుద్ధంగా మారి ఎంతటి అనర్థాలకు దారి తీస్తుందోనని ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

యుద్ధ నష్టాలు, భయాలు-వాస్తవాలు

గత నెల రోజులుగా అమెరికా ఇజ్రాయిల్ సంయుక్తంగా ఇరాన్ పై జరిపిన సైనిక దాడుల వల్ల ఇరాన్ లో 165 మంది పాఠశాల విద్యార్థులతో పాటు సుమారు 1500 మందికి పైగా ప్రజలు, ఖమేనీ వంటి సుప్రీం లీడర్ తో సహా కమాండర్లు, ఆరు వేల సైనికులు మరణించినట్లు వార్తలు వస్తున్నాయి. వేలాది నివాస భవనాలు వేలాది ఆతిథ్య సముదాయాలు దెబ్బతిన్నాయని ఇరాన్ ప్రకటించింది . లక్షల మంది నిరాశ్రయులయ్యారు. ఆయుధ నిల్వలు, బేస్ క్యాంప్ లు, నేవీ, బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లు ధ్వంసం అయ్యాయి. ఇరాన్ ప్రతి దాడులతో అమెరికా సైనిక స్థావరాలు గల గల్ఫ్ దేశాలు, అమెరికా, ఇజ్రాయిల్ లు కూడా నష్టపోయాయి . అమెరికా 16 యుద్ధ విమానాలు, 4 గురు పైలట్లు, 10 మంది సిబ్బంది, గల్ఫ్ దేశాల్లోని సైనిక స్థావరాలు, మౌలిక వసరులు ధ్వంసం అయ్యాయి. ఇందు కోసం అమెరికా రోజుకు రూ.7500 కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ లెక్కన నెలరోజుల్లో రూ.2.25 లక్షల కోట్లు యుద్ధంలో ఖర్చు చేసింది. ఇజ్రాయిల్ లో కూడా ఆస్తి ప్రాణ నష్టాలు జరిగాయి. ఇరాన్, ఇజ్రాయిల్, ఖతార్, దుబాయ్ , ఒమన్, ఎమిరేట్స్ లలో పలు బేస్ క్యాంపులు, కార్యాలయాలు, భవన సముదాయాలపై పరస్పర దాడులతో మౌలిక వసతులు ధ్వంసం అయ్యాయి. ఈ దాడులు వల్ల సాధారణ పౌరులు వందల సంఖ్యలో ప్రాణాలు కోల్పోవారు. లక్షల మంది నిరాశ్రయులయ్యారు. పెద్ద పెద్ద భవన సముదాయాలపై క్షిపణుల దాడులు జరిగినప్పుడు ప్రజలు ఆర్తనాదాలు చేస్తూ పరుగెత్తడం వంటి హృదయ విదారక సంఘటనలు కనిపిస్తున్నాయి. చమురు క్షేత్రాలు, బేస్ క్యాంప్ లు, కార్యాలయాలు, వాణిజ్య భవన సముదాయాలపై దాడితో పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో ఆర్థిక నష్టాలతో పాటు పర్యావరణం ధ్వంసం అయి కాలుష్యం పెరుగుతోంది. తొలి 15 రోజుల్లో 50 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలు వెలువడ్డాయి. పర్యావరణ కాలుష్యం ప్రమాద స్థాయికి చేరుకుంది. ఫలితంగా వాతావరణ ఉష్ణోగ్రతల మార్పులు జరిగి ప్రకృతి విపత్తులు సంభవిస్తున్నాయి. భారత, ఇరాన్ దేశాల మధ్య అనాదిగా సంబంధాలు కొనసాగుతున్నాయి. భారత చమురు అవసరాల్లో 85 శాతం దిగుమతి చేసుకుంటుండగా అధిక శాతం ఇరాన్ తదితర గల్ఫ్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. భారత్ నుండి ఏటా బియ్యం, మొక్కజొన్న, సోయా, పసుపు, మిర్చి, మామిడి, నిమ్మ, పత్తి తదితర చిరుధాన్యాలు ఇరాన్ కు ఎగుమతి అవుతున్నాయి. అయితే ప్రస్తుతం అమెరికా ఇజ్రాయిల్ ఇరాన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఇంధన మార్కెట్లలో అనిశ్చితి నెలకొంది. దీంతో ఉత్పత్తి సరఫరాలు, ఎగుమతి దిగుమతులు, పారిశ్రామిక ఉత్పత్తులపై ప్రభావం పడుతోంది. ఆర్థిక క్షీణతకు దారితీసి సామాన్య ప్రజలపై పెను ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

యుద్ధ విరమణ - శాంతి చర్చలు జరగాలి

ఆధునిక ప్రపంచ జీవనశైలిలో చమురు ఉత్పత్తి, వినియోగం ప్రధాన పాత్ర పోషిస్తోంది. మధ్య ప్రాచ్య దేశాలు సహజ చమురు క్షేత్రాలు కల్గి ఉన్నందున ఉత్పత్తి , సరఫరాలో ప్రధాన భాగస్వామ్యం కల్గి ఉన్నాయి. చమురు ఉత్పత్తి, సరఫరాలో సంక్షోభం తలెత్తితే ఆర్థిక వ్యవస్థ సంక్షోభం ఎదర్కొనే పరిస్థితి ఉందని విశ్లేషకులు అంటున్నారు. అలా ప్రపంచ ఆర్థిక మాంద్యం ఏర్పడక ముందే రెండో ప్రపంచ యుద్ధానంతరం ఏర్పడిన ఐక్యరాజ్య సమితిలోని 193 సభ్య దేశాల్లోని భారత్, రష్యా, చైనా, యూరోప్ దేశాలు ఏవైనా ప్రపంచ శాంతి కోసం, యుద్ధ విరమణ కోసం శాంతి చర్చలు నిర్వహించాలి. అగ్ర రాజ్యమైన అమెరికా ఇరాన్ పై ఎందుకు దాడి చేసిందో పునరాలోచించాలి. ఆయా దేశాలకు ఉండే సార్వభౌమాధికారాన్ని, స్వయం ప్రతిపత్తిని గౌరవించాలి. ప్రపంచ ప్రజల కోరికగా ప్రపంచ శాంతి, అభివృద్ధి కోసం అన్ని దేశాలు ఆలోచించాలి. యుద్ధం ముగిసేలా చర్చలు, చర్యలు జరగాలని ఆశిద్దాం. ప్రపంచ శాంతి వర్ధిల్లాలి.

(వ్యాసకర్త చరిత్ర విద్యార్థి, రచయిత)

బొమ్మకు పాడె.. బాల్యానికి శిక్ష!



ముహమ్మద్ ముజాహిద్
9640622076

గాజా వీధుల్లో విషాదపు ఆటలు.. పసి మనసులపై చెరగని యుద్ధ ముద్ర నిన్నటి దాకా ఆ చేతులు గాలిపటాలు ఎగురవేసేవి.. నిన్నటి దాకా ఆ గొంతులు నవ్వుల పువ్వులు పూయించేవి.. కానీ నేడు? ఆ పసి చేతులు బొమ్మలకు అంతిమయాత్ర నిర్వహిస్తున్నాయి. ఆ లేత పెదవులు మరణం గురించి మాట్లాడుతున్నాయి. యుద్ధం కేవలం భవనాలను కూల్చడం లేదు.. ఒక తరం బాల్యాన్ని సజీవ దహనం చేస్తోంది. లోకం నిండా ఎన్నో ఆటలు.. గిల్లీ దండలు, గోళీలు, బొమ్మల పెళ్లిళ్లు. కానీ, గాజాలోని శరణార్థి శిబిరాల్లో వినిపిస్తున్న ఆటల చప్పుడు వేరు. అక్కడ వినిపించేది నవ్వుల గలగలం కాదు.. మరణపు మౌనం. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక వీడియో చూస్తుంటే రాతి గుండె కూడా నీరవుతోంది.

ఆటలోనూ.. ఆఖరి ప్రయాణమే!

వైరల్ అవుతున్న ఆ దృశ్యంలో.. అయిదేళ్లు కూడా నిండని నలుగురు చిన్నారులు ఒక ఆట ఆడుకుంటున్నారు. అది దాగుడు మూతలో, దొంగా పోలీసు ఆట కాదు. తమ వద్ద ఉన్న ఒక చిన్న బొమ్మను పాడె మీద పడుకోబెట్టి 'అంతిమయాత్ర' నిర్వహిస్తున్నారు. ఒక పాత పైపు ముక్కను స్ట్రెచర్‌లా మార్చి, దానిపై బొమ్మను ఉంచి, నలుగురు చిన్నారులు తమ భుజాల మీద మోసుకెళ్తుంటే.. చూడటానికి రెండు కళ్లు చాలడం లేదు.

కళ్లముందు శవాలే పాఠాలైతే..

పిల్లలు తమ చుట్టూ ఏం చూస్తారో, దాన్నే తమ ఆటల్లో అనుకరిస్తారు. గాజాలోని చిన్నారుల కళ్లముందు నేడు రంగుల ప్రపంచం లేదు. బాంబుల మోత, రక్తపు చారికలు, వరుసగా పేర్చిన శవాల మధ్యే వారు శ్వాస తీసుకుంటున్నారు. తమ అన్నలనో, తమ్ముళ్లనో, కన్నవారినో స్ట్రెచర్ల మీద తీసుకెళ్తున్న దృశ్యాలే వారికి నిత్యకృత్యమయ్యాయి. అందుకే, వారు ఆడుకునే ఆటల్లో కూడా 'మరణం' భాగమైపోయింది.



చెదిరిన రంగుల స్వప్నం

సాధారణంగా పిల్లలు బొమ్మలకు పెళ్లిళ్లు చేస్తారు, విందులు వడ్డిస్తారు. కానీ ఇక్కడ యుద్ధం ఆ చిన్నారుల సృజనాత్మకతను కూడా విషాదం వైపు మళ్లించింది. "ఈ పిల్లలు మానసిక వేదన (Trauma) యొక్క అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉన్నారు. ఆటల ద్వారా వారు తమ లోపల ఉన్న భయాన్ని బయటకు పంపుతున్నారు" అని మనస్తత్వ నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయుధాల వేటలో పాలకులు గెలవొచ్చు.. కానీ ఆ పసి వాళ్ల కళ్లలో ఉండాల్సిన మెరుపును మాత్రం శాశ్వతంగా చంపేస్తున్నారు. ఆటల్లో కూడా అంతిమయాత్రలు నిర్వహిస్తున్న ఆ పసి హృదయాలకు శాంతి ఎప్పుడు దొరుకుతుందో? ప్రపంచ మానవత్వం ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది.

వైకల్యాన్ని జయించిన క్రీడాకారిణి



కోట దామోదర్
9391480475

ఆర్చరీ లేదా విలువిద్యలో రాణించాలంటే శారీరక సమతుల్యత, కచ్చితమైన ప్రణాళిక, సాధించాలనే పట్టుదల ఇవన్నీ తప్పనిసరి. ముఖ్యంగా చేతులు లేని వారు ఈ క్రీడలో రాణించడం అసాధ్యం అనిపించడం సహజం. కానీ అలాంటి అసాధ్యాన్ని సైతం సుసాధ్యంగా మార్చిన స్ఫూర్తిదాయకమైన యువ క్రీడాకారిణి జమ్మూ కాశ్మీర్‌కు చెందిన శీతల్ దేవి. రెండు చేతులు లేకపోయినా, మొక్కవోని పట్టుదలతో ఆమె తన కాళ్లతో, భుజాల సహాయంతో విల్లు ఎక్కించి బాణాలు సంధించడం నేర్చుకుంది. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. సంకల్పబలం ఎంత శక్తివంతమైనదో అని చెప్పడానికి ప్రత్యక్ష సాక్ష్యం శీతల్ దేవి జీవన గాథ. వైకల్యం ఒక అవరోధం అయినప్పటికీ, ఆ అవరోధాన్నే ఆమె అవకాశంగా మార్చుకుంది. అదే అవరోధం ఆమెకు ప్రేరణగా మారింది. తన శారీరక పరిస్థితిని ఒక దుర్బలంగా భావించకుండా, తన లక్ష్యాన్ని చేరుకునే ఉద్దేశంతో ఆమె దృఢ సంకల్పంతో ముందుకు సాగింది. గతేడాది దక్షిణ కొరియాలోని గ్వాంగ్జూలో జరిగిన ప్రపంచ పారా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగిన శీతల్ దేవి "చేతులు లేని" ఏకైక మహిళా ఆర్చర్‌గా ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. తన అద్భుత ప్రతిభతో అంతర్జాతీయ పారా క్రీడల్లో సత్తా చాటి, ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. రెండు చేతులు లేకపోయినప్పటికీ, తన కాలి వేళ్లు మరియు భుజం సాయంతో విల్లును లక్ష్య బిందువుపై ఎక్కుపెట్టే ఆమె ప్రతిభను చూసి ప్రేక్షకులు తమ కనురెప్పలు వేయడం కూడా మర్చిపోయారంటే అతిశయోక్తి కాదు. ఆమె క్రీడా నైపుణ్యం మరియు సంకల్పబలం అందరినీ ఆకట్టుకుంటుంది. ఆమె ఆటను ప్రత్యక్షంగా చూడటానికి ప్రాంగణానికి తరలి వచ్చే అభిమానులు కోకొల్లలు. ఆమె వదిలే ప్రతి బాణం లక్ష్యాన్ని చేరుకోవడమే కాదు, ప్రేక్షకుల హృదయాలనూ తాకుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ అద్భుత ప్రతిభతోనే అంతర్జాతీయ ఈవెంట్లలో పతకాలు సాధిస్తున్న శీతల్ దేవి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఈ క్రమంలో వార్షిక అవార్డులలో ఆమెను "పారా ఆర్చర్ ఆఫ్ ద ఇయర్" అవార్డుకు ఎంపిక చేస్తూ ప్రపంచ ఆర్చరీ సంస్థ గౌరవించింది. ప్రపంచ క్రీడా రంగంలో అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ప్రేరణాత్మక వ్యక్తుల్లో ప్రముఖుడు 'మాట్ స్టట్జ్మాన్' ఒకరు. ఆయనను "Armless Archer" అని కూడా పిలుస్తుంటారు. చేతులు లేకపోయినా, తన కాళ్ల సహాయంతో విల్లు పట్టి బాణం సంధిస్తూ ప్రపంచస్థాయిలో అద్భుత ప్రతిభను ప్రదర్శించారు ఆయన. పారాలింపిక్స్‌లో రజత పతకం సాధించి, ప్రపంచం గర్వించదగిన విలుకాడిగా చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించారు. అలాగే మహిళా విభాగంలో శీతల్ దేవీ ఒక గర్వించదగిన క్రీడాకారిణిగా ఆవిర్భవించారు. ఆమె చిన్న వయసులోనే విలువిద్యలో చేరి, కఠిన సాధనతో అంతర్జాతీయ స్థాయిలో పతకాలు



సాధించింది. తన దృఢ సంకల్పం, పట్టుదలతో అసాధ్యాన్ని సుసాధ్యం చేసి, ప్రపంచంలోనే గుర్తింపు పొందిన గొప్ప విలువిద్యా క్రీడాకారిణిగా నిలిచింది. 'మాట్ స్టట్జ్మాన్' మరియు 'శీతల్ దేవీ' వంటి మహోన్నత క్రీడాకారుల జీవితాలు ప్రతి ఒక్కరికి గొప్ప స్ఫూర్తినిస్తాయి. వీరిద్దరూ శారీరక వైకల్యం ఉన్నప్పటికీ, దానిని ఒక ప్రతిబంధకంగా భావించకుండా ఒక సవాలుగా తీసుకుని తమ ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పారు. తమ వైకల్యాన్ని బలహీనతగా భావించకుండా, అదే తమ ప్రత్యేకతగా మార్చుకుని ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారు. విజయం ఒక్కరోజులో రాదు. నిరంతర సాధన, కృషి ఉంటేనే ఉన్నత స్థానానికి చేరుకోవచ్చు అనే అక్షర సత్యాన్ని వారి జీవితాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి. కాబట్టి ప్రతి విద్యార్థి వీరి జీవితాల నుండి స్ఫూర్తి పొందుతూ, ఏ పరిస్థితులైనా ఎదుర్కొని, తమ లక్ష్యాన్ని సాధించడానికి నిరంతరం కృషి చేయాలి. ప్రతి వ్యక్తి కూడా ఇలాంటి ఘన విజయాలు సాధించాలని ఆశిస్తున్నాను.

పకడ్బందీగా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు



ప్రతిపక్షం మహేశ్వరం ఏప్రిల్ 2: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని తుమ్మలూరు గ్రామంలో...99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా...గురువారం జిల్లాలోని మహేశ్వరం మండలంలోని తుమ్మలూరు గ్రామ పరిధిలో గల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణా రావు, జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. గ్రామ సభ లో ఏర్పాటు చేసిన సంక్షేమ శాఖ, ఉద్యానవన శాఖ, వైద్య ఆరోగ్య శాఖల స్టాల్స్ ను సీఎస్, కలెక్టర్ సందర్శించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు వారి పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును క్షుణ్ణంగా వివరించారు. రైతు రుణ మాఫీ, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సభ్యులకు మంజూరైన వడ్డీ లేని రుణాల వివరాలు, కొత్త రేషన్ కార్డులు, పాస్ బుక్కులు, సన్న బియ్యం పంపిణీ, వైద్య సేవలు, తదితర పథకాలకు సంబంధించి లబ్ధిదారుల పూర్తి వివరాలను గ్రామ ప్రజలకు తెలియజేశారు. అదే విధంగా నూతన పథకాలైన ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా, మధ్యాహ్న భోజన పథకం ఇంటర్మీడియట్ కు విస్తరణ, విభిన్న ప్రతిభావంత ఇంటర్మీడియట్ విద్యార్థులకు మోటారు వాహనాలు, పంటల వైవిధ్యం, సహజ సేంద్రీయ వ్యవసాయం పథకాలపై అవగాహన కల్పించారు.వివిధ పథకాల లబ్ధిదారులు వారి అభిప్రాయాలను గ్రామ సభలో తెలియజేస్తూ.. ప్రజా ప్రభుత్వంలో నిరుపేదలైన తమకి వివిధ రకాల సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని హర్షం వ్యక్తం చేశారు.ప్రజల సమస్యలను సి.ఎస్. కలెక్టర్ నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి సిఎస్ మాట్లాడుతూ 2047 విజన్ తో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలపాలన్నది గౌరవ ముఖ్యమంత్రి ఉద్దేశమన్నారు. మనమందరం ఈ ప్రగతి పాలనలో భాగస్వాములం కావాలని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ గ్యారంటీ పథకాలతో పాటు, కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అన్ని హాస్టళ్లు, స్కూళ్లలో డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను పెంచడం ద్వారా పేద విద్యార్థులకు మెరుగైన ఆహారం, వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. మహిళా సాధికారత కొరకు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, స్కూల్ యూనిఫాం కుట్టే పనులు, ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణ వంటి కార్యక్రమాల ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లోని సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే ఈ సభల ముఖ్య ఉద్దేశమని అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామ స్థాయిలోనే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రైతు భరోసా, గృహ జ్యోతి, మహాలక్ష్మి వంటి పథకాలు ప్రజలకు చేరేలా అధికారులు కృషి చేస్తున్నారని, అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకాల ప్రయోజనాలను పొందాలని సూచించారు.గ్రామ అభివృద్ధి కోసం ప్రజల భాగస్వామ్యం కీలకమని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, పిల్లల విద్యపై దృష్టి పెట్టడం, ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ వహించాలని అన్నారు. అనంతరం కళ్యాణ లక్ష్మి చెక్కులు, దివ్యాంగులకు ట్రై సైకిళ్లను లబ్ధిదారులకు సిఎస్ అందజేశారు. గ్రామసభ సమీపంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను సిఎస్ కలెక్టర్ తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి, డిపిఓ సురేష్ మోహన్, జిల్లా అధికారులు శ్రీలత, సురేష్, వనజాత, శ్రీలక్ష్మి, లలితా దేవి, తాసిల్దార్, ఎంపీడీవో, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి రంగారెడ్డి జిల్లా గారిచే జారీ చేయనైనది. ఈ యొక్క కార్యక్రమంలో..తుమ్మలూరు సర్పంచ్ తుమ్మేటి అండాలు కృష్ణ యాదవ్ ఉప సర్పంచ్ సంగారెడ్డి వార్డు సభ్యులు పెద్దలు మహిళలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గంగారంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక



ప్రతిపక్షం, మహేశ్వరం, ఏప్రిల్ 2: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలోని గంగారం గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ మాట్లాడుతూ... గ్రామపంచాయతీ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా 99 రోజు కార్యక్రమంలో నేడు సమావేశం ఏర్పాటుచేసిన ప్రభుత్వం ఎన్నో పథకాలు మొదలు పెట్టి అమలు పరుస్తుందన్నారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్, ఉపసర్పంచ్ మహేందర్, ఎం పాండు నాయక్, ఏం రవి నాయక్, ఎం మోహన్ నాయక్, పద్మాదేవ, ఎం ధర్మ, ఎం భాస్కర్, శాంతి, శారద, మనమ్మ, దర్జీ సేల, గ్రామ సెక్రెటరీ నవీన్ యాదవ్, శ్రీను కేరాజు, తదితులు పాల్గొన్నారు.



నక్షబాటలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

- త్వరలో పొలిమేరల సర్వే
- తహసీల్దార్ గౌతమ్ కుమార్

ప్రతిపక్షం, మొయినాబాద్, ఏప్రిల్ 2 : గ్రామీణ ప్రాంతాల్లో నక్షబాటలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గౌతమ్ కుమార్ హెచ్చరించారు. బాకారం జాగీర్ గ్రామ పంచాయతీలో సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. త్వరలోనే గ్రామ పొలిమేరలు, నక్షబాటలను సర్వే చేయించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని భరోసా ఇచ్చారు. గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పాలకవర్గం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుభాష్ చంద్రబోస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కే వెంకట్ రెడ్డి, ఫారెస్ట్ ఆఫీసర్ టి రవి ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి శివశంకర్, వార్డు సభ్యులు కొంతం నాగేశ్వర్ రెడ్డి, పంచలింగాల రాధిక, ఉమా రాణి, ఉపేందర్ యాదవ్, బంధి అనిల్, కే రవి, కొండకల్ల అమృత, కొండకల్ల స్వాతి, దినేష్ రెడ్డి జిపిఓ రాజేష్, మరియు వివిధ శాఖల అధికారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



పడమటి తండాలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం

- గ్రామసభలో ప్రజా పాలనపై చర్చలు

ప్రతిపక్షం, మహేశ్వరం, ఏప్రిల్ 2: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలోని పడమటి తండా గ్రామపంచాయతీ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ తండా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నూతన భవన గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వినోద్ రాథోడ్ నూతన గృహాన్ని రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశం చేశారు.కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఎంపీఎస్ఓ విజయలక్ష్మి, గ్రామ వార్డు సభ్యులు జ్యోతి రమేష్,సేవ్యా నాయక్,శ్రీను నాయక్,బాబూలాల్ నాయక్ మరియు పడమటి తండా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.అదే కార్యక్రమంలో భాగంగా గ్రామసభ సమావేశం కూడా నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామసభలో సర్పంచ్ వినోద్ రాథోడ్, ఉప సర్పంచ్ రాజు నాయక్, వార్డు సభ్యులు శ్రీను నాయక్, సాజీ బాయి, సేవ్యా నాయక్, రాజేష్‌నాయక్, బుజ్జి బాయి, జ్యోతి బాయి, మమత బాయి మరియు ఎంపీఎస్ఓ విజయలక్ష్మి పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



ప్రజల సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

ప్రతిపక్షం, మహేశ్వరం, ఏప్రిల్ 2: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని నందుపల్లి గ్రామంలో.. గ్రామ సర్పంచ్ దేశపాగ నరసింహ యాదవ్ మాట్లాడుతూ.. గ్రామంలో 99 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామసభ నిర్వహించడం జరిగిందన్నారు గ్రామసభలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న 6 గ్యారంటీ ల గురించి ప్రజలకు ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయో ఇంకా గ్రామంలోని సమస్యల గురించి తెలుసుకోవడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో గ్రామంలోని ముఖ్యమైన సమస్యల గురించి చర్చించారు.



నెల రోజుల్లో పద్ధతి మార్చుకోండి

- వస్తున్నమా, పోతున్నామా అన్నట్లు పని చేస్తే కుదరదు
- అధికారులపై ఎమ్మెల్సీ ఫైర్
- వీబీజీరాంజీ స్కీంను నిర్లక్ష్యం చేస్తారా?
- భానూరు గ్రామసభలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 2: ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం భానూరు గ్రామంలో జరిగిన గ్రామసభలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం అందించే వీబీజీ రాం జీ స్కీం ను పక్కాగా అమలు చేయాలని ఎంపీడీఓకు ఆదేశాలు జారీ చేశారు. వీబీజీ రాం జీ స్కీంలో అధికారులు ఏండ్లు గడుస్తున్న గ్రామంలో ఉపాధి పనులు, పశువుల గొట్టాలు అవగాహన కల్పించకచాలా మంది నిజమైన అర్హులకు సంక్షేమ ఫలాలు అందలేదని అధికారుల తీరుపై మండిపడ్డారు. పేరుకే వచ్చామా, పోయమా అనే పద్ధతితో అధికారులు పనిచేయడం కరెక్ట్ కాదన్నారు. నిధులు ఉపయోగం లేక లాప్స్ అయ్యాయని తెలిపారు. కేంద్రం పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యత మీరు తీసుకోవాలని అన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఎమ్మెల్సీగా గ్రామ సభకు హాజరైతే సంబంధిత అధికారులు రాకపోవడం ఏంటి, దాదాపు పదివేల జనాభా ఉన్న గ్రామంలో పదిమంది కూడా గ్రామ సభలో లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో కరెంటు సమస్యలు, డ్రైనేజీ ఇబ్బందులు, చాలా సమస్యలతో బాధపడుతున్నారని అన్నారు. నెలరోజులు టైం ఇస్తాను పద్ధతి మార్చుకోవాలని అన్నారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ భివృద్ధి కోసం అంతా కలిసి రావాలి. ఈ ప్రాంత అభివృద్ధి కోసం నా సహకారం ఎప్పటికి ఉంటుందని ఎమ్మెల్సీ అంజిరెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో యాదగిరి, సర్పంచ్ శాంతయ్య, ఈఓపిఆర్డి హరిశంకర్ గౌడ్, ఈఓ రవికుమార్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



చైతన్య వర్సిటీలో 'సాంప్రదాయ' వైభవం

- కనువిందు చేసిన 'ట్రెడిషనల్ డే' వేడుకలు
- భారతీయ సంస్కృతిని చాటిచెప్పిన విద్యార్థులు

ప్రతిపక్షం, మొయినాబాద్, ఏప్రిల్ 2 : మండల పరిధిలోని హిమాయత్ నగర్ చైతన్య డీమ్డ్ టుబి విశ్వవిద్యాలయంలో 'సాంప్రదాయ దినోత్సవం' (ట్రెడిషనల్ డే) వేడుకలు అంబరాన్నంటాయి. విద్యార్థులు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా రంగురంగుల వస్త్రధారణతో హాజరుకావడంతో వర్సిటీ ప్రాంగణమంతా పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా వర్సిటీ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్ సి.హెచ్.పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి వేడుకలు విద్యార్థుల్లో తమ మూలాల పట్ల గౌరవాన్ని, భిన్నత్వంలో ఏకత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. డైరెక్టర్ డాక్టర్ సాత్విక రెడ్డి మాట్లాడుతూ.. ఆధునిక కాలంలోనూ సాంప్రదాయ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. విద్యార్థులు చేసిన జానపద, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.శంకర్ లింగం, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.రవీందర్, వివిధ విభాగాల డీన్స్ రాజు, కవిత, ప్రత్యూష రెడ్డి, సుగంధ దేవి, క్రిస్టోఫర్, జగదీశ్వర్, పీఆర్ఓ గాదె రాంబాబు రెడ్డి మరియు అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభించిన తహసీల్దార్

ప్రతిపక్షం, మొయినాబాద్, ఏప్రిల్ 2 : వేసవి ఎండల దృష్ట్యా బాటసారుల సౌకర్యార్థం బాకారం జాగీర్ పంచాయతీలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ గౌతమ్ కుమార్ ప్రారంభించారు. సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ఆయన అభినందించారు. గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పాలకవర్గం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుభాష్ చంద్రబోస్ రెడ్డి, వార్డు సభ్యులు కొంతం నాగేశ్వర్ రెడ్డి రాయనోళ్ల ఉపేందర్ యాదవ్, కొండకల్ల అమృతఎల్లయ్య, ఫారెస్ట్ అధికారులు, గ్రామ కార్యదర్శి శివశంకర్, జిపిఓ రాజేష్,నాయకులు శ్రీకాంత్ గౌడ్, సిద్ధార్థ రెడ్డి, శ్రీశైలం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీ మహా చండీ సాహిత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

- స్వామివారిని దర్శించుకున్న మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి
- పఠాన్ చేరు నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ కాట శ్రీనివాస్ గౌడ్ దంపతులు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 2 :పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామంలో సర్పంచ్ ఎల్లగోని విక్రమ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ మహా చండీ సాహిత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ మహోత్సవంలో తెలంగాణ రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్, సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ దంపతులు పాల్గొని, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించడంతో పాటు, సమాజంలో మానవతా విలువలను పెంపొందించేందుకు తోడ్పడతాయన్నారు. దేవాలయాల అభివృద్ధికి, భక్తుల సేవకు అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు మా పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. స్వామివారి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. ఇంత పెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించిన నందిగామ సర్పంచ్ ఎల్లగోని విక్రమ్ గౌడ్ ను వారు ప్రత్యేకంగా అభినందించారు. శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, భక్తులు తరలివచ్చారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం, గ్రామ ఉపసర్పంచ్ గౌరీమియా, గ్రామ వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.





కాట గృహనిర్బంధం, కార్యకర్తల ఆందోళన

- పటాన్ చెరులో ఉద్రిక్తత
- శివాలయానికి వెళ్లకుండా కాటను అడ్డుకున్న పోలీసులు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 2 : పటాన్ చెరు నియోజకవర్గంలో రాజకీయ ఉద్రిక్తత తారాస్థాయికి చేరింది. పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ తను విసిరిన సవాల్ కు అనుగుణంగా శివాలయానికి వెళ్ళడానికి భారీగా కార్యకర్తలు చేరుకోవడం తో శివాలయానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆయన నివాసం వద్ద పోలీసులు తెల్లవారుజాము నుంచే భారీగా బందోబస్తు ఏర్పాటు చేసి గృహనిర్బంధం చేశారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశం లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పై కాట శ్రీనివాస్ గౌడ్ సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. భూ వ్యవహారాలు, మార్కెట్ లైసెన్సుల జారీ లో కోట్ల రూపాయల స్కాం జరిగిందని ఆరోపిస్తూ నువ్వా.. నేనా అంటూ శివాలయంలో తేల్చుకుందామని ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం శివాలయానికి వెళ్లేందుకు కాట శ్రీనివాస్ గౌడ్ సిద్ధమయ్యారు. అయితే పోలీసులు ముందస్తు చర్యగా ఆయనను అడ్డుకున్నారు. శివాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు నిలువరించడంతో కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తర్వాత కాట శ్రీనివాస్ గౌడ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని నార్సింగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. చర్చకు వెళ్లకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.



అమరావతి చట్టబద్ధత బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలపడం శుభపరిణామం. ఇకపై రాజధాని అమరావతి అజేయం. ఎవరో వచ్చి ఏదో చేస్తారు అనే అనవసర అపోహలను రాష్ట్ర ప్రజలందరూ విడిచి పెట్టేయాలి. రాష్ట్రానికి రాజధాని ఉండటమే ఇష్టం లేని వారు చేస్తున్న వ్యాఖ్యలను ప్రజలెవరూ పట్టించుకోవాల్సిన అవసరం లేదు. అమరావతిలో అభివృద్ధి కార్యకలాపాలు ఇప్పటికే వేగవంతం అయ్యాయి.

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

ప్రాంతీయం



పాత లే అవుట్ లలో కబ్జాకు గురైన
రెండు పార్కులను కాపాడిన హైడ్రా

- 5797 గజాల పార్కు చుట్టూ హైడ్రా ఫెన్సింగ్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి , ఏప్రిల్ 2: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం, స్థానికంగా విలేజ్ పరిధిలో రెండు పార్కులను హైడ్రా గురువారం కాపాడింది. సర్వే నంబరు 152, 153లలో 15 ఎకరాల మేర 144 పాట్లతో శ్రీ వేంకటరమణ కాలనీ పేరిట లే ఔట్ వేశారు. మునోత్ ప్రైవేట్ ట్రస్ట్ కు మేనేజింగ్ ట్రస్టీగా ఉన్న ఫవర్‌లాల్ ఈ లే ఔట్ వేయగా తర్వాత 2012లో ఆ బాధ్యతలు చేపట్టిన మహేకుమార్ జైన్ ఇందులో 7 ఎకరాలను వ్యవసాయ భూమిగా పేర్కొంటూ అమ్మేశారు. 15 ఎకరాలలో వేసిన లే ఔట్ కు హుడా అనుమతి ఉంది. అయినా ఇందులో 7 ఎకరాలను వ్యవసాయ భూమిగా అమ్మేశారని వెంకటరమణ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 7 ఎకరాలకు సంబంధించిన వివాదం కోర్టులో ఉంది. ఇదే అదనుగా మిగిలిన 8 ఎకరాల లే ఔట్ లోని 4960 గజాలతో ఓ పార్కు, 837 గజాలతో మరో పార్కు కబ్జా చేసే ప్రమాదం ఉంది, కాపాడాలని హైడ్రాకు వినతి పత్రం సమర్పించారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో సంబంధిత శాఖలతో హైడ్రా అధికారులు పరిశీలించారు. అప్పట్లో హుడా అనుమతి పొందిన లే ఔట్ ప్రకారం పార్కు స్థలాలను గుర్తించారు. తర్వాత పార్కుల చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేశారు. పార్కు స్థలాలుగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేశారు. హైడ్రా కాపాడిన పార్కు స్థలాల విలువ దాదాపు రూ. 47 కోట్ల వరకు ఉంటుందని అంచనా.



అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- కౌన్సిలర్ గోపగోని శోభన్‌బాబు
- 20వ వార్డులో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' సభ

ప్రతిపక్షం, హుస్నాబాద్, ఏప్రిల్ 2: పట్టణంలోని 20వ వార్డులో నిర్వహించిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' సభ వార్డు కౌన్సిలర్ గోపగోని శోభన్ బాబు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల మంజూరు, గృహజ్యోతి పథకం, స్వశక్తి సంఘాలకు వడ్డీ లేని రుణాలు, రుణమాఫీ వంటి పథకాలపై ప్రజలకు వివరించారు. అలాగే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ చీరల పంపిణీ వంటి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక కృషితో హుస్నాబాద్ పట్టణం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని శోభన్ బాబు పేర్కొన్నారు. పట్టణంలో నిర్మిస్తున్న ఇంజినీరింగ్ కళాశాల, ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులు, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం శరవేగంగా సాగుతున్నాయని వివరించారు. వార్డులో నెలకొన్న పలు సమస్యలపై ఈ సభలో సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా పట్టణంలో ప్రజలను వేధిస్తున్న కోతులు, కుక్కలు, పందుల బెడదను అరికట్టాలని గ్రామసభలో తీర్మానించారు. వీటితో పాటు 20వ వార్డులో కొత్తగా సీసీ రోడ్లు, మురికికాల్వల నిర్మాణం చేపట్టాలని, ఇతర అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానాలను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వార్డు ప్రముఖులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



బొమ్మల కట్టయ్య సేవలు మరువలేనివి

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఏప్రిల్ 2: గడచిన 45 ఏళ్లుగా దళిత గిరిజనుల కోసం నిరంతరం పాటుపడి అంబేద్కర్ ఆశయ సాధన కోసం పనిచేసిన బొమ్మల కట్టయ్య సేవలు మరువలేని అని పలువురు వక్తలు కొనియాడారు. కరీంబాద్లోని కట్టయ్య విగ్రహానికి పూలమాలవేసి 82వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు రౌతు రమేష్ కుమార్ మాట్లాడుతూ ఆయన అడుగుజాడల్లో నడిచినప్పుడు ఆయన ఆశయాలను కొనసాగించిన వారు అవుతారని అభిప్రాయపడ్డారు. బొమ్మల కట్టయ్య కుటుంబ సభ్యులతో పాటు పలువురు ప్రజాసంఘాల నాయకులు ఈ జయంతి వేడుకలో పాల్గొన్నారు. అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎల్లయ్య, బిఎస్ఐ రాష్ట్ర కార్యదర్శి అంబేద్కర్ కడారి కుమార్, రాజ్ కుమార్, మాస్టర్ జి నరసన్న, గిద్దె నర్సయ్య, సారంగపాణి తదితరులు ఈ జయంతి వేడుకలో పాల్గొన్నారు.



రీజనల్ సైన్స్ సెంటర్ ను సందర్శించిన ఎమ్మెల్యే, కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఏప్రిల్ 2: హనుమకొండ హంటర్ రోడ్డు జూ పార్క్ సమీపంలో ఉన్న రీజనల్ సైన్స్ సెంటర్ ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి గురువారం సందర్శించారు. రీజినల్ సైన్స్ సెంటర్ పని విధానంతో పాటు అక్కడ ఉన్న వివిధ శాస్త్ర సాంకేతిక పరికరాలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పరిశీలించారు సైన్స్ సెంటర్ లో పనిచేయని పలు పరికరాలను భవనంలో సౌకర్యాల ఏర్పాట్లను గురించి వారు ఆరా తీశారు. రీజినల్ సైన్స్ సెంటర్ లో నూతన శాస్త్ర సాంకేతిక పరికరాలు సదుపాయాల కల్పన గురించి రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి అధికారి డాక్టర్ శ్రీనివాస్ ఎమ్మెల్యే, కుడా ఛైర్మన్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. శాస్త్ర సాంకేతిక పరికరాలు, సదుపాయాల కావలసిన మరమ్మతులు చేయించాలని సూచించారు తగిన ప్రతిపాదనలు సమర్పించినట్లయితే అవసరమైన నిధులు మంజూరు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు అదేవిధంగా రీజనల్ సైన్స్ సెంటర్ ప్రాంగణంలో ఉన్న ఎస్సీ ఎస్టీ సెల్ ను జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు ఈ సందర్భంగా కుడా సిపిఓ అజిత్ రెడ్డి ఈఈ భీమ్ రావు ఇతర అధికారులతో పాటు రీజనల్ సైన్స్ సెంటర్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- మంత్రి దామోదర్ రాజనర్సింహ



ప్రతిపక్షం,సంగారెడ్డి ప్రతినిధి , ఏప్రిల్ 2 : రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని , పేదల అభ్యున్నతే లక్ష్యంగా పలు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఆందోల్ మండలం అల్మాయిపేట గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. గ్రామసభ తెలంగాణ గీతంతో ప్రారంభమైంది. అనంతరం రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని గ్రామ ప్రజలకు చదివి వినిపించారు. వివిధ శాఖల అధికారులు గ్రామాల్లో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల లబ్ధిదారుల వివరాలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ ప్రతి గ్రామంలో మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు 30 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని 28 స్వయం సహాయక సంఘాలకు రూ.3.50 కోట్ల రుణాలు అందించగా, రూ.2.50 లక్షల వడ్డీ సబ్సిడీ ఇచ్చినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, వడ్డీ లేని రుణాలు, రైతు భరోసా, రైతు భీమా, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు ఎన్నో అమలు చేస్తున్నట్లు చెప్పారు. అల్మాయిపేట గ్రామంలోని సర్వే నం. 513లో కొత్త కాలనీ ఏర్పాటు చేస్తే రహదారులు, నీటి ట్యాంక్, విద్యుత్ సౌకర్యాలు, ఇళ్ల నిర్మాణం వంటి అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ, హైవే నుండి అల్మాయిపేట-కొన్యాల వరకు బీటీ రహదారి, అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణాలకు మంజూరు చేస్తామని తెలిపారు. మంజూరైన 7 ఇందిరమ్మ ఇళ్లలో 4 మాత్రమే నిర్మించబడిన నేపథ్యంలో మిగిలిన లబ్ధిదారులు కూడా వెంటనే నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. అవసరమైన ఆర్థిక సహాయం అందించడమే కాకుండా వ్యక్తిగతంగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఇల్లు నిర్మించేందుకు ముందుకు వచ్చే వారికి కొత్తగా ఇళ్ల మంజూరు కూడా చేస్తామని తెలిపారు. అందోల్ ప్రాంతంలో ఉన్నత విద్యా సంస్థలు ఏర్పాటు చేశామని, విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని కోరారు. ఆందోల్ నియోజకవర్గంలో త్వరలో ఫార్మసీ కళాశాల స్థాపన జరుగుతుందని, సంగుపేట గుట్ట వద్ద రెండు మూడు పరిశ్రమలు రానున్నట్లు వెల్లడించారు. పేదలకు చెందిన సుమారు 40 ఎకరాల అసైన్డ్ భూమి తప్పుగా రిజిస్ట్రేషన్ అయిన విషయంపై ఆర్డీవోకు ఆదేశాలు జారీ చేసి, రిజిస్ట్రేషన్ రద్దు చేసి భూములను అసలు లబ్ధిదారులకు తిరిగి ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన పథకాలు అర్హులందరికీ చేరేలా చూడాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వచ్చే రెండు నెలల్లో 10 శాఖల ద్వారా చేపట్టే కార్యక్రమాలలో ప్రజలు చురుకుగా పాల్గొనాలని కోరారు. కొత్తగా పిల్లలకు పోషకాహారంతో కూడిన రాగి జావాతో బ్రేక్‌ఫాస్ట్ పథకం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా పథకాలను ప్రభుత్వం త్వరలో అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు గృహ నిర్మాణానికి మంత్రి, కలెక్టర్ కలిసి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, సర్పంచ్, ఉప సర్పంచ్, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మహిళల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి

- పంచాయతీ రాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్
- ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికతో గ్రామాల్లో సంక్షేమం విస్తరణ
- కలెక్టర్ పి. ప్రావీణ్య.



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 2: కొండాపూర్ మండలం తోగార్పల్లి గ్రామంలో గురువారం ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక, 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామ సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పాల్గొన్నారు. గ్రామ సభను రాష్ట్రగీతంతో ప్రారంభించారు. అనంతరం ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రసంగాన్ని గ్రామ ప్రజలకు వినిపించారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామంలో అమలవుతున్న పలు కీలక పథకాల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా పంచాయతి రాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ జిల్లాలో అధిక శాతం అధికారులుగా మహిళలే ఉన్నారని, మహిళలు పనిచేస్తే సాధించలేనిది ఏదీ లేదని తెలిపారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని పేర్కొన్నారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించి, స్వయం సహాయ సంఘాలకు రుణాలు, డిజిటల్ హెల్త్ కార్డులు, జీవనోపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. మహిళలను బస్సు, పెట్రోల్ బంక్ యజమానులుగా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఇప్పటికే గ్రామాల్లో శానిటేషన్ డ్రైవ్ నిర్వహించామని, రాబోయే 90 రోజుల్లో శాఖల వారీగా పది ముఖ్య అంశాలపై కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గ్రామాలలో అమలవుతున్న పథకాల లబ్ధిదారుల వివరాలను వెల్లడిస్తూ, గ్రామ సభలలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో ప్రజలు తమ అర్జీలు, అభ్యంతరాలు, సూచనలు సమర్పించాలని సూచించారు. ప్రభుతం కొత్తగా అల్పాహారం పథకం, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం,దివ్యాంగ విద్యార్థులకు మోటర్ వాహనాల పంపిణీ, మధ్యాహ్నం భోజనం పథకం ఇంటర్నెట్ వరకు విస్తరణ, పంటల సహజ సేంద్రియ వ్యవసాయం పంటల వైవిధ్య కరణ వంటి పథకాలను చేపట్టనున్నట్లు తెలిపారు . ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుకు చేరేలా అధికారులు కృషి చేయాలని, గ్రామ సభలను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భముగా సభకు హాజరైన లబ్ధిదారులు రైతు భరోసా పథకం కింద లబ్ధి పొందిన రైతులు,సంక్షేమ పథకాల లబ్ధిదారులు తమ అభిప్రాయాలను తెలిపి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం తోగరుపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న మహిళా భవనం పనులను పరిశీలించారు. అలాగే గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి, ఉపాధి హామీ పథకం కింద గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను కమిషనర్ దివ్య దేవరాజన్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జానకి రెడ్డి, పీడీ డీఆర్‌డీఓ జ్యోతి, గ్రామ సర్పంచ్ దివ్య వాణి ప్రశాంత్ గౌడ్, ఉపసర్పంచ్ , ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి

- నివాళులర్పించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 2: బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316వ వర్ధంతి సందర్భంగా సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వారి చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు . వారు తెలంగాణ ప్రాంతంలో అందించిన స్ఫూర్తి , త్యాగాన్ని భవిష్యత్ తరాలకు అందించే విధంగా వారు నిర్మించిన కోటలను పర్యాటకంగా, పురావస్తు కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, అదనపు జిల్లా కలెక్టర్ మాధురి, అదన జిల్లా కలెక్టర్ (స్థానిక సంస్థలు) పాండు, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్ , జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికతో గ్రామాభివృద్ధి సాధ్యం

- మహిళల సాధికారతకు 99 రోజుల కార్యాచరణతో సమగ్ర అభివృద్ధి
- మంత్రి కొండా సురేఖ



ప్రతిపక్షం ప్రతినిధి, హన్మకొండ, ఏప్రిల్ 2: వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కొత్తపెల్లి గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినదని, గ్రామాభివృద్ధికి ఇది కీలకమని ఆమె పేర్కొన్నారు.99 రోజుల కార్యాచరణలో ప్రతి అంశం ముఖ్యమని, గ్రామ సభలను సద్వినియోగం చేసుకుని గ్రామ సమస్యలను ప్రజలే ముందుకు వచ్చి పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే సూచించారురాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించిన ఎమ్మెల్యే టీఎస్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ ద్వారా ఆర్థికంగా బలహీన వర్గాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. మహిళల సాధికారత కోసం స్వయం సహాయక సంఘాల బలోపేతం వడ్డీ రహిత రుణాలు ఆర్థిక సహాయం వంటి పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. రైతుల సంక్షేమం కోసం రైతు బంధు, రైతు బీమా పథకాల ద్వారా పెట్టుబడి సహాయం, బీమా రక్షణ కల్పిస్తున్నామని వివరించారు.పంటల సాగులో సహజ పద్ధతులను ప్రోత్సహిస్తూ ఆర్గానిక్ వ్యవసాయానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించి బాలల ఆరోగ్యాన్ని కాపాడుతున్నామని, గర్భిణీ స్త్రీలు, బాలింతలకు ప్రత్యేక పోషకాహార పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. దివ్యాంగులకు బ్యాటరీ వాహనాలు, పెన్షన్లు, సహాయక పరికరాలు అందిస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల ద్వారా గ్రామాలు, పట్టణాల్లో మౌలిక వసతులు అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.తాగునీటి సమస్యల పరిష్కారానికి మిషన్ భగీరథ, సాగునీటి కోసం మిషన్ కాకతీయ వంటి ప్రాజెక్టులు కీలకంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే నాగరాజు వెల్లడించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలంటే ప్రజల భాగస్వామ్యం అత్యవసరమని, గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి ప్రభుత్వం అందించే అవార్డులను సాధించాలని పిలుపునిచ్చారు. ప్రకృతి సిద్ధమైన ఆవుపేడ, గోవుమూత్రం వేపాకులు వంటి ఆర్గానిక్ పద్ధతులను వినియోగిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారుఆరోగ్యమే మహాభాగ్యం అన్న భావనతో ప్రతి ఒక్కరు జీవించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

"



ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓపెనర్‌గా విఫలమైనప్పటికీ పంత్ ఆ స్థానాన్ని వదలొద్దు. పవర్ ప్లే తర్వాత వస్తే బౌలర్లు ఈజీగా కట్టడి చేస్తారు. అందుకే 14 మ్యాచ్‌ల్లోనూ ఓపెనర్‌గానే రావాలి. కోచ్ లాంగర్, లక్నో మేనేజ్‌మెంట్‌లో ఎవరైనా ఈ విషయంపై పంత్‌కు నచ్చజెప్పి స్వేచ్ఛగా ఆడే అవకాశం ఇవ్వాలి.
- మాజీ క్రికెటర్ అశ్విన్

పల్లె ప్రగతిలో అందరూ భాగస్వాములు కావాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- అట్టహాసంగా ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక గ్రామ సభలు



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఏప్రిల్ 2: పల్లెలు, పట్టణాల సర్వతోముఖాభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలలో అన్ని వర్గాల వారు భాగస్వాములు కావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే సత్వర ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం మోస్రా మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామ సభలో కలెక్టర్ పాల్గొన్నారు. జయ జయహే తెలంగాణ రాష్ట్ర గేయంతో గ్రామసభకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. తమ సమస్యలను ప్రజలు రాతపూర్వకంగా తెలియజేసేందుకు వీలుగా గ్రామ సభ వేదిక వద్ద ఫిర్యాదుల బాక్సును అందుబాటులో ఉంచారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న లబ్ధిదారుల వివరాలను గ్రామ సభలో ఒక్కో పథకం వారీగా పేరుపేరున ప్రకటించారు. పంట రుణాల మాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకం, గృహ జ్యోతి, చేయూత పథకం, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, సన్న ధాన్యంకు బోనస్ చెల్లింపు తదితర వాటి ద్వారా గ్రామంలో లబ్ది పొందిన వారి వివరాలు చదివి వినిపించారు. పలువురు లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల తమకు చేకూరిన ప్రయోజనాల గురించి గ్రామసభలో తమ అనుభవాలను తెలియజేస్తూ, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మునుముందు అమలు చేయనున్న పథకాల గురించి ప్రజలకు తెలియజేస్తూ, రాష్ట్ర ప్రగతి, సంక్షేమంలో వారిని భాగస్వామ్యం చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని అన్నారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధిపై ప్రజల నుండి అభిప్రాయాలు సేకరించారు. గ్రామ సభలో మోస్రా సర్పంచ్ శ్రీకాంత్, మండల ప్రత్యేక అధికారి రతన్, ఎం.పీ.డీ.ఓ శ్రీనివాస్, ఎం.పీ.ఓ వెంకటేశ్వర్లు, గ్రామ కార్యదర్శి శ్రవణ్, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విజయవంతమైన గ్రామ, వార్డు సభలు

ప్రజా ప్రభుత్వం - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం నిజామాబాద్ జిల్లాలోని 545 గ్రామ పంచాయతీలలో నిర్వహించిన గ్రామ సభలు, మున్సిపల్ పట్టణాలలోని 146 వార్డులలో నిర్వహించిన వార్డు సభలు విజయవంతం అయ్యాయి. జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి పర్యవేక్షణలో గ్రామ, వార్డు సభలకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేశారు. వేసవి సీజన్ ను దృష్టిలో పెట్టుకుని ఉదయం వేళలోనే 7.30 నుండి 10.30 గంటల వరకు సభలను నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సభలలో భాగస్వాములు కాగా, ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మోస్రా మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామ సభతో పాటు, బోధన్ మున్సిపల్ పట్టణంలోని 26, 35 వార్డులలో జరిగిన వార్డు సభలలో పాల్గొన్నారు. నిజామాబాద్ రూరల్ శాసన సభ్యులు డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి డిచ్పల్లి మండలం మెంట్రాజ్ పల్లిలో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొనగా, నిజామాబాద్ నగర మేయర్ ఆకుల ఉమారాణి నగర పాలక సంస్థ పరిధిలోని 49వ డివిజన్ కసాబ్ గల్లిలో నిర్వహించిన వార్డు సభలో పాల్గొన్నారు. రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిరణ్ కుమార్ లు మాక్లూర్ మండలం మామిడిపల్లి గ్రామ పంచాయతీలో జరిగిన గ్రామ సభలో పాల్గొన్నారు. అదేవిధంగా ఇంచార్జి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దిలీప్ కుమార్ మోపాల్ మండలం తానాఖుర్దు గ్రామ సభలో పాల్గొన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వి.గంగాధర్ గౌడ్ లు డిచ్పల్లి మండలం రాంపూర్ గ్రామ సభలో భాగస్వాములయ్యారు. ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ ఏర్గట్ల మండలం తడ్ పాకల్ లో, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో రెంజల్ మండలం దూపల్లి గ్రామ సభలో పాల్గొన్నారు.



ప్రజా పాలన పేరిట పబ్బం గడుపుకోవాలని చూస్తున్న ప్రభుత్వం

- మంగోలు గ్రామ మాజీ సర్పంచ్

ప్రతిపక్షం, గజ్వేల్ (కుకునూరు పల్లి), ఏప్రిల్ 2: రెండున్నర ఏళ్లుగా అమలు కాని 420 హామీలు, ఆరు గ్యారెంటీలను పక్క త్రోవ పట్టించేందుకు ప్రజా పాలన పేరుతో మసి బూసి మారేడు కాయ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుందని మంగోల్ గ్రామ మాజీ సర్పంచ్ కిరణ్ చారి ధ్వజమెత్తారు. గురువారం నాడు కుకునూరుపల్లి మండలం మంగోల్ గ్రామంలో ఏర్పాటు చేసిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' గ్రామసభ కేవలం ఒక మొక్కుబడి కార్యక్రమమని, దీనివల్ల ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని కిరణ్ చారి తీవ్రస్థాయిలో విమర్శించారు. గురువారం గ్రామంలో నిర్వహించిన ఈ గ్రామసభ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పేరుతో భారీ మోసం జరుగుతోందని, కళ్యాణ లక్ష్మికి తులం బంగారం ఇస్తామని చెప్పి మాట తప్పారని విమర్శించారు. పెన్షన్లు పెంచుతామని ఆశ చూపి వృద్ధులను సైతం వంచించారని, గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మంజూరై పెండింగ్‌లో ఉన్న నిధులు మాత్రమే ఇప్పుడు వస్తున్నాయని, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని స్పష్టం చేశారు. ఆర్భాటపు సభలతో కాలక్షేపం చేయకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జిల్లాలో ఘనంగా హనుమాన్ జయంతి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఏప్రిల్ 2 : జిల్లాలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. హనుమాన్ ఆలయాలకు భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి అన్నప్రసాద వితరణ కార్యక్రమాలలో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని గోల్ హనుమాన్, నీరుగోండా హనుమాన్, రోకడు హనుమాన్, హనుమాన్ జంక్షన్ ఆలయం, మహాలక్ష్మి నగర్ అభయ ఆంజనేయ స్వామి ఆలయం, న్యూ హౌసింగ్ బోర్డ్ వినాయక్ నగర్ హనుమాన్ ఆలయం, ఆర్య నగర్ హనుమాన్ ఆలయం, నవీపేట్ మండలం తుంగిని హనుమాన్ ఆలయాలతో పాటు వివిధ మండలాలలో గల హనుమాన్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ప్రతి యువకుడు ధర్మ మార్గంలో నడవాలి

- పలు ఆలయాలను దర్శించుకున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఏప్రిల్ 2: సమాజంలో ప్రతి యువకుడు ధర్మ మార్గంలో నడవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్త పిలుపునిచ్చారు. గురువారం హనుమాన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నీలకంఠేశ్వరం ఆలయం ముందు ఏర్పాటుచేసిన హనుమాన్ శోభాయాత్రను ఎమ్మెల్యే జండా ఊపి శోభాయాత్ర ర్యాలీను ప్రారంభించారు. అంతకు ముందు ఎమ్మెల్యే నగరం లోని హనుమాన్ జన్మోత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం సారంగాపూర్, నీరుగొండ హనుమాన్ ఆలయాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి యువకుడు హనుమంతుడిలా మారాలని, నిజాయితీగా ఉంటూ ధర్మాన్ని నిలబెట్టాలని అన్నారు. ఈ పవిత్రమైన రోజు మనమందరము ఒక సంకల్పం చేయాలని, సమాజ సేవలో ముందుండాలన్నారు. ధర్మ మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఇది ఒక పండుగ మాత్రమే కాదని, మనలోని శక్తిని మేల్కొలిపే రోజు అన్నారు. శ్రీరాముడి సేవలో హనుమంతుడు చూపిన అంకితభావం, నిజాయితీ, ధైర్యం ప్రతి ఒక్కరికి మార్గదర్శకం అన్నారు. భక్తి, బలం, నిబద్ధతకు ప్రతీకైన ఆంజనేయస్వామి అందరికీ స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఇందూరులో నిర్వహించే హనుమాన్ శోభాయాత్ర తెలంగాణలోనే అతిపెద్ద శోభాయాత్రగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా నగరంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. దారి పొడవునా పలు స్వచ్ఛంద సంస్థలు, హనుమాన్ భక్తులు ర్యాలీలో పాల్గొన్నవారి కోసం మజ్జిగ, పండ్లు, పులిహోర తదితర పదార్థాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ 1300 మంది పోలీసులతో ర్యాలీకి బందోబస్తు ఏర్పాటు చేశారు. కంటేశ్వర ఆలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ జిల్లా పరిషత్, నాందేవ్ వాడ, శివాజీ చౌక్, దేవీ రోడ్డు, గాంధీ చౌక్, నెహ్రూ పార్క్ పెద్ద బజార్ చౌరస్తా మీదుగా ఆర్ ఆర్ చౌరస్తా వద్ద ముగిసింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇల్లెందుల ప్రభాకర్, పుట్ట వీరేందర్, మాయావార్ కృష్ణ, పవన్ ముందడ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులు

పూర్తి చేసి ప్రజల అందుబాటులోకి తేవాలి

- లేదంటే మంత్రుల పర్యటనలను అడ్డుకుంటాం
- నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ 'వంటేరు'



ప్రతిపక్షం, గజ్వేల్, ఏప్రిల్ 2: గత ప్రభుత్వ కాల పరిమితి మూసే నాటికి గజ్వేల్ నియోజకవర్గ కేంద్రంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి బిఆర్ఎస్ పార్టీహయాంలో చేపట్టిన పనులు పూర్తిగా కాకుండా అసంపూర్తిగా ఉండటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటే ప్రతాప్ రెడ్డి అన్నారు. ఇందులో భాగంగానే ట్రాఫిక్ ను నియంత్రించడానికి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ చుట్టూ 16 కిలోమీటర్ల రింగ్ రోడ్డును దాదాపు 250 కోట్లతో నిర్మాణం చేశామని తెలిపారు. వంద మీటర్ల రింగ్ రోడ్డు పనులు పెండింగ్లో ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న రోడ్డును పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోనికి తేవాలని ఆలోచన లేని అసమర్ధ ప్రభుత్వం కాంగ్రెస్ అని విమర్శించారు. అలాగే కోర్టు భవన నిర్మాణ పనులు చేపట్టాలని, కోట మైసమ్మ మిగిలిన రోడ్డు పనులు పూర్తి చేయాలని ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం పెండింగ్ పనుల కోసం మంజూరు చేసిన 180 కోట్ల రూపాయలను వెంటనే మంజూరు చేసి గజ్వేల్ నియోజకవర్గం లో అసంపూర్తిగా ఉన్న బస్టాండ్ నిర్మాణాలతో పాటు, రింగ్ రోడ్డు, కోర్టు భవనాలు, కోట మైసమ్మ రోడ్డు, ఇతర నిర్మాణ అభివృద్ధి కార్యక్రమాలు నెల రోజులలో పూర్తి చేయాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, వివేక్ గౌడ్ లని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ గజ్వేల్ పర్యటనను అడ్డుకొని పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్మన్ కళ్యాణ్ పద్మాబాయి నర్సింగరావు, పట్టణ అధ్యక్షుడు నమాజ్ మీరా, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఉడెం కృష్ణారెడ్డి కౌన్సిలర్లు మన్నే రూపా వెంకటేష్, అత్తిలి శ్రీనివాస్, మామిడి శ్రీధర్, గోలి మమతా సంతోష్, కోట బాబు, కోలి చెలిమి భవాని కరుణాకర్, కప్ప మమతా పోచయ్య, భాగ్యలక్ష్మి కనకసేన మాజీ కౌన్సిలర్లు దుర్గాప్రసాద్, మరికంటి కనకయ్య, లక్ష్మాపూర్ మాజీ సర్పంచ్ కొలిచెల్మి స్వామి, నాయకులు అహ్మద్, ఉమర్, స్వామి చారి, ఎలా వెంకటేష్, ఎక్కలదేవి కనకరాజు, తదితరులున్నారు.



సమగ్ర ప్రణాళికతో గ్రామాల అభివృద్ధి

- ప్రజా సంక్షేమమే ధ్యేయం
- ప్రణాళిక ద్వారా సమస్యల పరిష్కారం
- షబ్బీర్ అలీ

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, ఏప్రిల్ 2: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా గ్రామీణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ఆరోగ్య సేవల మెరుగుదల, రహదారుల నిర్మాణం వంటి పలు రంగాల్లో వేగంగా అభివృద్ధి జరుగుతుందని ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ పేర్కొన్నారు. గురువారం దోమకొండలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభలో పాల్గొన్న పాల్గొన్న అయన, గ్రామస్తులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక గురించి షబ్బీర్ అలీ వివరంగా ప్రజలకు తెలియజేశారు. మండల అభివృద్ధిలో భాగంగా రూ.75 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ పనులు పూర్తయితే దోమకొండలో మౌలిక వసతులు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. గ్రామసభలో భాగంగా గ్రామస్తులు పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేయగా, కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని, 500 లకే గ్యాస్ సిలిండర్ అందిస్తూ ఆడబిడ్డల ఆర్థిక భారాన్ని తగ్గిస్తున్నామని అన్నారు. ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ, చీకటి గదుల్లో వెలుగులు నింపుతున్నామన్నారు. సొంత ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించుకోవడానికి 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం ఇచ్చే బాధ్యత మన ప్రభుత్వానిదని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మధు మోహన్, గ్రామ సర్పంచ్ నరసయ్య, తిరుమల గౌడ్, పాత రాజు, అనంతరెడ్డి, నర్సింగరావు, సుతారి రమేష్, మధు ఐరేణి సందీప్, పండ్ల రాజు, కారంగుల అశోక్ రెడ్డి, దేవరాజ గౌడ్, స్వామి, శ్రీనివాస్, శంకర్ రెడ్డి, శ్రీకాంత్, పుల్ల బోయిన రమేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





కాషాయమైన గజ్వేల్ పట్టణం

- ఘనంగా హనుమాన్ జయంతి

ప్రతిపక్షం, గజ్వేల్, ఏప్రిల్ 2: శ్రీరామ భక్త హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం నాడు గజ్వేల్ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా పట్టణ ప్రజలు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రధాన ఆకర్షణగా విల్లు చేబూనిన శ్రీరాముడు, గదా దరుడైన హనుమాన్ ప్రతిమలను ఊరేగిస్తూ "జైశ్రీరామ్" నినాదాలతో పట్టణం దద్దరిల్లింది. ఈ సందర్భంగా స్థానిక మజీద్ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ లో పాల్గొన్న ప్రజలకు మజ్జిగను మంచినీటి అందజేసి. మతసామరస్యాన్ని చాటుకున్నారు. పటంలోని పలు ప్రధాన కూడలిలో రాజకీయ పార్టీలకు అతీతంగా మజ్జిగ, మంచినీటి సౌకర్యాన్ని కల్పించారు.



పవనపుత్రుడి ఆశీస్సులతో

ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు
- మెదక్‌లో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, ఏప్రిల్ 2: పవనపుత్రుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రంలో పంచముఖి హనుమాన్ దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్రీ హనుమంతుడు భక్తి, శక్తి, ధైర్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. హనుమాన్ జయంతి మనకు శారీరక, మానసిక బలాన్ని ఇచ్చే పర్వదినమని తెలిపారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే గుణానికి ఆంజనేయుడే ఆదర్శమని అన్నారు. పవనపుత్రుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ నరేష్, పట్టణ పార్టీ అధ్యక్షులు ఎం గంగాధర్ మున్సిపల్ కౌన్సిలర్లు నాయకులు, హనుమాన్ మాలదారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



విజ్ఞప్తుల స్వీకరణతో ప్రారంభమైన ప్రగతి ప్రణాళిక

ప్రతిపక్షం, గజ్వేల్, ఏప్రిల్ 2: ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో గురువారం నాడు ప్రగతి ప్రణాళిక పట్టణాభివృద్ధి కార్యక్రమాన్ని పట్టణంలోని పలు వార్డులో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యల విజ్ఞప్తిలను స్వీకరించి వాటిని నమోదు చేసుకొని త్వరలో పరిష్కరించే విధంగా కృషి చేయనున్నట్లు వార్డు కౌన్సిలర్లతో పాటు అధికారులు వార్డు ప్రజలకు హామీ ఇచ్చారు. మున్సిపల్ అధికారులతొ ప్రజల సమస్యలు ,ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధి దారులకు చేరెవిదంగ మరియు ఎవరైన సంక్షేమ పథకాలు రాని వారు ఉంటె వారి నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్, నాయిని సత్యలక్ష్మి యాదగిరి, అలాగే పలు వార్డులలో ఆయా అవార్డు కౌన్సిలర్ లు, అధికారులు,మున్సిపల్ వార్డు ఆఫీసర్, ఆర్పి, వ్యవసాయ మార్కెట్ కమిటి డైరెక్టర్ వహిద్ బాయ్, ఇందిరమ్మ కమిటీ సబ్యులు షకీల్ బాయ్ ,సయిద్, యాదయ్య సార్, బిక్షపతి, అయిత వెంకటేష్ , పలు వార్డుల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



శత్రువు కదలికలను ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలని, అటాక్ చేస్తే ఎదురుదాడికి సిద్ధంగా ఉండాలని మా దళాలకు ఆదేశాలిచ్చాం. మా దేశంపై గ్రౌండ్ ఆపరేషన్‌కు దిగితే ఏ ఒక్కరూ ప్రాణాలతో బయటపడరు. ఎలాంటి దాడినైనా మేము దీటుగా ఎదుర్కొంటాం.

- ఇరాన్ ఆర్మీ చీఫ్ అమీర్ హతామీ

ప్రాంతీయం



చైత్ర మాస పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్ , ఏప్రిల్ 2 : శ్రీశ్రీశ్రీ పరమపూజ్య మహా ప్రేమావతార స్వయంభూః ఆది పరబ్రహ్మ మహా గురు జై మహావిభోశ్రీః వారి ఓమౌజయాః ఏకోపాసన మహాధర్మం ఆధ్వర్యంలో వందనం ఓమౌజయాః ఆధ్వర్యంలోగురువారం ఎన్సాన్ పల్లి గ్రామంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి సుమారు 3000 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చదువుల్లో ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిల్ లను బహుమతులుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు మహాగురు శ్రీమూర్తి క్యాలెండర్, లడ్డు ప్రసాదం, నోట్ బుక్స్ ఉచితంగా అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగుల స్రవంతి ప్రశాంత్ ఉపసర్పంచ్ సంతోష్ రెడ్డి ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రెడ్డి కార్పొరేషన్ కోసం పోరాటం

- హామీలు నెరవేర్చకపోతే గుణపాఠం తప్పదు
- రెడ్డి జేఏసీ అధ్యక్షుడు రాంరెడ్డి

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 2: రాష్ట్రంలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర రెడ్డి జెఏసి అధ్యక్షుడు అప్పమ్మగారి రాం రెడ్డి హెచ్చరించారు. హామీలు నెరవేర్చకపోతే రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని స్పష్టం చేశారు.గురువారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో ఈ రోజు సిద్ది పేట జిల్లా రెడ్డి జెఏసి ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర రెడ్డి జెఏసి అధ్యక్షుడు అప్పమ్మగారి రాం రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. 2023 శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రెడ్డిలకు ఇచ్చిన హామీలను ఇప్పటికీ అమలు చేయకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు, ప్రతిపక్ష నాయకునిగా రెడ్డి జెఏసి నిర్వహించిన సభల్లో పాల్గొని, అధికారంలోకి వచ్చిన వెంటనే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి, నిరుపేద రెడ్డిలను ఆదుకుంటామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఆ హామీలు నెరవేరలేదని ఆరోపించారు. , రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ వద్ద "చలో కలెక్టరేట్" కార్యక్రమం నిర్వహించి వినతిపత్రం సమర్పిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్డిలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. నిరుపేద రెడ్డిల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్డి జెఏసి జిల్లా అధ్యక్షులు ఐలేని మల్లికార్జున రెడ్డి, గౌరవ అధ్యక్షులు మా రెడ్డి రాం లింగా రెడ్డి, ప్రధాన కార్యదర్శి పన్యాల విష్ణువర్ధన్ రెడ్డి, ముక్కిస రెడ్డి, దూది దుర్గ రెడ్డి, కవ్వ లింగా రెడ్డి, గూడ పద్మ రెడ్డి, వంగ శైలజ రెడ్డి, వెంకట్ రెడ్డి, సంతోష్ రెడ్డి, భూపతి రెడ్డి, నరసింహారెడ్డి, మధుసూదన్ రెడ్డి, అయిలేని గాల్ రెడ్డి, వట్టిపల్లి రాజీ రెడ్డి, రాం రెడ్డి, తిరుపతి రెడ్డి, ఆరుట్ల రాజీ రెడ్డి, చంద్రారెడ్డి, జనార్ధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



సర్వాయి పాపన్న ఆశయాలు యువతకు ఆదర్శం

- అదనపు కలెక్టర్ నగేష్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఏప్రిల్ 2: కులం, సామాజిక సమానత్వం, న్యాయం కోసం పోరాడిన వీర యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతివేడుకల్లో అదనపు కలెక్టర్ నగేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమాన్ని పాపన్న గౌడ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజంలో అణచివేతకు వ్యతిరేకంగా పాపన్న గౌడ్ చేసిన పోరాటం చిరస్మరణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు మంగా రమేష్ గౌడ్, రేణుక ఎల్లమ్మ ఆలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ విధ్యాధర్ గౌడ్, సంఘ నాయకులు నర్సింహులు గౌడ్, సురేందర్ గౌడ్, నాగరాజు గౌడ్, యాదగిరి గౌడ్, శంకర్ గౌడ్, కుమార్ గౌడ్ సహాయ వెనుక బడిన తరగతుల అభివృద్ధి అధికారి గంగాకిషన్, కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్, లవన్, భాను ప్రకాష్, ఆరీఫ్, నర్సింహులు, సిద్దరాములు, పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలు పకడ్బందీగా అమలు

- గ్రామ సభలో మెదక్ కలెక్టర్ ప్రతిమ సింగ్

ప్రతిపక్షం, చేగుంట, ఏప్రిల్ 2: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను పగడ్బందీగా అమలు చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అంశం పై చేగుంట మండలం వడియారం గ్రామ సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అమలు చేసిన పథకాలలో వడియారం గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా 32 ఇందిరమ్మ గృహాలు 188 కొత్త రేషన్ కార్డులు 151 మంది లబ్ధిదారులకు ఆరోగ్య శ్రీ పథకం 574 మందికి గృహ జ్యోతి పథకం 166 మంది రైతులకు రుణమాఫీ 513 మందికి చేయూత పెన్షన్లు 25 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి వర్తించిందన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణ లాంటి కార్యక్రమాలను ఆర్థికంగా బలోపేతం చేయడం జరుగుతుందని కలెక్టర్ ప్రతిమ సింగ్ వివరించారు . ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక రాజకీయాలకు అతీతంగా అధికారుల సమక్షంలో ఎంపిక చేయడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు . వేసవిలో తాగునీటి సమస్య విద్యుత్ సమస్య జటిలం కాకుండా అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి హేమా భార్గవి ఎంపీడీవో చిన్నారెడ్డి వైద్యశాఖ అధికారి అనిల్ కుమార్ సర్పంచ్ సాయికుమార్ ఉప సర్పంచ్ నాగరాజు ఇన్చార్జి ఏ పి ఓ విజయ పాల్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



విభజన తర్వాత రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ మారింది. శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధతతో ప్రజలకు స్పష్టత ఇస్తున్నాం. 2014లోనే అమరావతిపై అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం జరిగింది. కానీ 2019–-24 మధ్య వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల నాటకమాడింది. రాజధాని కోసం ఉద్యమించిన రైతులను హింసించింది.
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజలకు సంక్షేమ పథకాలు

అందించేందుకే వార్డు, గ్రామ సభలు

- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఏప్రిల్ 2: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో ప్రభుత్వ అభివృద్ధిపై అవగాహనతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారం. కోసమేనని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2న రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు ప్రారంభమయ్యాయి. గురువారం మెదక్ పట్టణంలోని 16,17 వార్డుల్లో, వార్డు సభల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం మెదక్ మండలం ముత్తాయి కోట, హవేలీ ఘనపూర్ మండలం నిర్వహించిన గ్రామ సభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకే గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు. తెలిపారు.గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సందర్భంగా గత రెండు సంవత్సరాలలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తూ ప్రజల సమస్యలను తీర్చేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని తెలిపారు.మున్సిపాలిటీలతోపాటు గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్స్ నిర్మించామని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రభుత్వ సంస్థలను, సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత విద్యుత్, 500 రూపాయలకే సిలిండర్ ,సన్న బియ్యం, తదితర పథకాలను 6 గ్యారంటీలను అమలు చేస్తున్నదని తెలిపారు. ఇంకా చాలామంది అర్హులైన వారికి రేషన్ కార్డులు రావాల్సి ఉందని, వాటిని కూడా ప్రభుత్వం మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళ శక్తి పథకం, మహిళకు ఉచిత బస్సు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పండించిన రైతులకు 500 రూపాయల బోనస్ వంటివి ఇదివరకే ఇవ్వడం జరిగిందని తెలిపారు. నూతన పథకాల లో భాగంగా పాఠశాల, ఇంటర్ విద్యార్థులకు అల్పాహారం, అన్ని వర్గాల ప్రజలకు జీవిత బీమా పథకం, దివ్యాంగులకు మోటారు బ్యాటరీ సైకిళ్లు, రైతులకు మేలైన వంగడాలు ఇస్తున్నామని, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సందర్భంగా నిర్వహిస్తున్న గ్రామసభలలో ఆయా పథకాల కింద లబ్ధి పొందిన లబ్ధిదారుల వివరాలన్నిటిని చదివి వినిపించడమే గాక, గ్రామంలో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతున్నదని వెల్లడించారు అంతకుముందు గ్రామలలో సర్పంచ్లు, మున్సిపాలి లలో మున్సిపల్ కమిషనర్లు అధ్యక్షతన గ్రామసభను,మున్సిపల్ వార్డు ప్రారంభించి రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు మున్సిపల్ వైస్ చైర్మన్ నరేష్, వార్డు మెంబర్లు ,గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, తదితరులు హాజరయ్యారు.

ప్రజా పాలనలో ప్రజల భాగస్వామ్యం అవసరం

- ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ



ప్రతిపక్షం, గజ్వేల్, ఏప్రిల్ 2: సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా పాలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, దీనిని దృష్టిలో పెట్టుకొని అధికారులు ఆ దిశగా కృషి చేయాలని వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్ స్పష్టం చేశారు. వర్గల్ మండల కేంద్రంలో సర్పంచ్ జయ భారతి అధ్యక్షతన గురువారం జరిగిన గ్రామ సభకు ఆమె హాజరై మాట్లాడారు. త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ భీమా పథకాన్ని అమలు చేయనుండగా, ఆ కుటుంబ సభ్యులకు సీఎం రేవంత్ రెడ్డి భరోసా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా, పార్టీలకు అతీతంగా వర్తింపజేస్తుండగా, పేదలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ప్రయోజనం పొందాలని సూచించారు. అయితే గ్రామ సభల్లో అర్హులైన పేదలను గుర్తించి అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేలా అధికారుల దృష్టికి తేవాలని తద్వారా ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, ప్రత్యేక అధికారి పవన్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సందీప్ కుమార్, మాజీ ఎంపీపీ మోహన్, మాజీ జెడ్పిటిసి ప్రభుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

ప్రతిపక్షం చేర్యాల, ఏప్రిల్ 2: చేర్యాల మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద టీవీఎస్ ఎక్సల్ మక్కల లోడుతో సిద్దిపేట వైపు వెళ్తున్న లారీ ఢీ కొనగా ఆకునూర్ గ్రామానికి చెందిన కడుదూరి కీర్తన ఆమె తాత బాలయ్యకు గాయాలైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. తీవ్ర గాయాలైన ఇంటర్ చదువుతున్న విద్యార్థి కీర్తన (17)ను హుటాహుటిన అంబులెన్స్ లో సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ లోని యశోద ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆకునూర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



వికలాంగుల పెన్షన్ 6 వేలకు పెంచాలి

- ఏప్రిల్ 13 న సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాను జయప్రదం చేయండి
- ఎన్పీఆర్డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య

ప్రతిపక్షం, దుబ్బాక, ఏప్రిల్ 2: వికలాంగుల హక్కుల జాతీయ వేదిక దుబ్బాక నియోజకవర్గం కార్యకర్తల సమావేశం గురువారం దుబ్బాక పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఎన్పీఆర్డీ జిల్లా అధ్యక్షులు ఎండి సాజిద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో వికలాంగుల సంక్షేమానికి నిధుల కేటాయింపులో తీవ్రమైన నిర్లక్ష్యం ప్రదర్శించిందని ,ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన 3,24,234 కోట్ల బడ్జెట్లో వికలాంగుల సంక్షేమనికి 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం 5 శాతం నిధులు కేటాయించాలి కానీ, బడ్జెట్ కేటాయింపుల్లో వికలాంగుల సంక్షేమ శాఖను పూర్తిగా విస్మరించారనీ విమర్శించారు. 2023 డిసెంబర్లో ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలనలో చేయూత పెన్షన్స్ కోసం 24.85 లక్షల మంది దరఖాస్తులు చేసుకుంటే బడ్జెట్లో 232.09 కోట్లు అదనంగా కేటాయించిన ప్రభుత్వం అర్హులైన 2 లక్షల మందికి కొత్తగా పెన్షన్స్ మంజూరు చేస్తామని ప్రకటించడం అంటే చేయూత లబ్ధిదారులను మోసం చేయడమే అవుతుందని విమర్శించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో 5 శాతం వికలాంగులకు కేటాయించాలని జివో ఉన్న ఎందుకు అమలు చేయడం లేదని అన్నారు. జిల్లాలో ఉన్న వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 13న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ఈ ధర్నా కు జిల్లాలోని వికలాంగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఎన్ పి ఆర్ డి దుబ్బాక డివిజన్ నాయకులు వి.యాదయ్య,వజ్జల రాజేశ్వర్, షాదుల్,లక్ష్మినర్సయ్య,కాల్వ రమేష్,చెట్టి నర్సింలు,బిట్ల బాబు,టి ఎల్లయ్య,కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ప్రారంభానికి రాజకీయ గ్రహణం

- భారత రాజ్యాంగ నిర్మాత ముసుగు తీసేవారు లేరా?
- చౌరస్తా ఆధునికరణ పేరుతో నిర్లక్ష్యం వహిస్తున్న ప్రజాప్రతినిధులు
- ఏప్రిల్ 14న బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ప్రారంభానికి నోచుకునేనా?



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్. ఏప్రిల్ 2: భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ప్రారంభానికి రాజకీయ గ్రహణం పట్టుకుంది. మెదక్ పట్టణ నడిబొడ్డున అంబేద్కర్ విగ్రహా న్ని జాతీయ రహదారి మధ్యలో ప్రతిష్టించారు. ప్రధాన చౌరస్తా ఆధునీకరణ పేరుతో విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ప్రారంభించకపోవడంతో మహనీయునికి ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తా లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం రోడ్డు వెడల్పు పేరుతో జాతీయ రహదారి అధికారులు విగ్రహాన్ని తీసివేశారు. గత మున్సిపల్ పాలకులు. దళిత సంఘాల మధ్య విగ్రహం తీసివేయరాదని వాదోపవాదాలు జరిగాయి. విగ్రహం తీస్తేనే రోడ్డు వెడల్పు పనులు జరుగుతాయని మున్సిపల్ అధికారులు పట్టుబట్టి తీసివేశారు. మున్సిపల్ అధికారులు మున్సిపల్ నిధుల తో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని, విగ్రహం ఉన్న చోటనే నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. మునిసిపల్ అధికారుల హామీ మేరకు దళిత సంఘాలు ఒప్పుకోవడంతో విగ్రహాన్ని తీసివేశారు. విగ్రహాన్ని తీసి మున్సిపల్ కార్యాలయంలో పెట్టారు. రాందాస్ చౌరస్తాలో ఎక్కడైతే అంబేద్కర్ విగ్రహం ఉందో అక్కడ గత పాలకులు గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రధాన చౌరస్తాలో శివాజీ విగ్రహం ఏర్పాటు చేయడం జరిగింది. రాందాస్ చౌరస్తా నుండి డిపో కి వెళ్లే ప్రధాన రహదారి పైన అంబేద్కర్ విగ్రహానికి స్థలానికి కేటాయించారు. మున్సిపల్ అధికారులు అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు రూ .4 లక్షల రూ. 50వేల కేటాయించి 12 ఫీట్ల విగ్రహాన్ని కొనుగోలు చేసి ప్రతిష్టించారు . గత 8 నెలల గా నుండి పనులు నత్తనడకన సాగుతున్నా యి. నూతనంగా ఏర్పడ్డ మున్సిపల్ పాలకవర్గం, దళిత సంఘాల నేతలు, ప్రజాస్వామిక వాదులు విగ్రహ ఏర్పాటులో నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు . 8 నెలల క్రితం అంబేద్కర్ విగ్రహానికి వేసిన ముసుగును వచ్చే 135వ జయంతి వేడుకలలో విగ్రహాన్ని ప్రారంభిస్తారని లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ నూతన పాలకవర్గం రాజ్యాంగ నిర్మాత విగ్రహాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. కార్మిక ,కర్షక, విద్యార్థి మేధావులు అంబేద్కర్ జయంతి వరకు విగ్రహాన్ని ప్రారంభించేందుకు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహాలను వెంటనే ఆవిష్కరించాలి: డీబీఎఫ్ డిమాండ్

జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహాలు గతంలో రెండు ఉండేవి జిల్లా అధికారులు గానీ దళిత ప్రజా సంఘాల పలు రాజకీయ పార్టీ నాయకులు అంబేద్కర్ జయంతి వర్ధంతిలు ఘనంగా నిర్వహించేవారు గత తొమ్మిది సంవత్సరాల నుండి విగ్రహాలు లేకపోవడంతో జయంతులు వర్ధంతిలు కేవలం పెక్సీల ఫోటోలకు మాత్రమే నిర్వహించడం జరుగుతుంది . అంబేద్కర్ విగ్రహం అంటే నిత్యం బహుజనులు తన మార్గాన్ని అనుసరించాలని ప్రజలు చైతన్యవంతమై చదువుకుంటూ పోరాడాలని ఆయన విగ్రహం ఒక స్ఫూర్తిగా నిలుస్తుంది అని అందుకే జిల్లాలోని దళిత బహుజన మైనార్టీలందరూ అంబేద్కర్ విగ్రహాన్ని గౌరవిస్తారని అలాంటి విగ్రహాలు మెదక్ జిల్లా కేంద్రంలో లేకపోవడం అని బహుజన ఫ్రంట్ జిల్లా కార్యదర్శి దయ సాగర్ అన్నారు. వెంటనే మున్సిపల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభించాలని. అంబేద్కర్ చౌరస్తాలో గల విగ్రహ ప్రతిష్ట పనులు వేగవంతంగా చేస్తూ విగ్రహాన్ని ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున అధికారికంగా జయంతి వర్ధంతి నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

దేశంలోనే అత్యంత అవినీతి సీఎం హిమంత బిశ్వశర్మ



- రాహుల్ గాంధీ ఆరోపణ

ప్రతిపక్షం, నేషనల్ డెస్క్: అసోం సీఎం హిమంత బిశ్వశర్మ దేశంలోనే అత్యంత అవినీతిపరుడైన సీఎం అని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాతో కలిసి అసోం సీఎం ల్యాండ్ ఏటీఎంను నడుపుతున్నారని విమర్శించారు. పేదల భూములు లాక్కొని కార్పోరేట్లకు కట్టబెడుతున్నారని ధ్వజమెత్తారు. అసోంలోని బోకాజన్‌లో జరిగిన ఎన్నికల సభలో రాహుల్‌గాంధీ పాల్గొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజులలోపు గాయకుడు జుబిన్ గార్గ్ కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దాదాపు 32వేల ఎకరాలకుపైగా భూములను అసోం సర్కార్ మూడు కార్పోరేట్ సంస్థలకు కట్టబెట్టిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ క్రమంలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీపైనా విరుచుకుపడ్డారు రాహుల్ గాంధీ. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ప్రధాని నరేంద్ర మోదీని నియంత్రిస్తున్నారని అన్నారు. భారత వ్యవసాయం, ఇంధనం, డేటా హక్కులను అమెరికాకు అప్పగించారంటూ మండిపడ్డారు. ఈ వాణిజ్య ఒప్పందం భారత రైతులు, చిరు వ్యాపారులు, పరిశ్రమలకు నష్టం కలిగిస్తుండగా, అమెరికా రైతులు, పరిశ్రమలకు లాభం చేకూర్చేలా ఉందన్నారు.

విశ్వ వీక్షణం



హర్మూజ్‌పై యూకే చర్చలు భారత్‌కు ఆహ్వానం

- ఇరాన్ సహా అన్ని దేశాలతో టచ్‌లోనే: కేంద్రం
- స్వేచ్ఛాయుత, సురక్షిత హర్మూజ్‌ను కోరుకుంటున్నాం
- ఐరాసలో బహ్రాయిన్ తీర్మానంపై భారత్ కీలక స్పందన
- ఇరాన్‌లోని 204 మంది భారతీయులను కాపాడాం
- విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: హర్మూజ్ జలసంధిని తెరిపించే అంశంపై చర్చల కోసం భారత్ సహా పలు దేశాలను యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) ఆహ్వానించిందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. గురువారం సాయంత్రం వర్చువల్‌గా జరగనున్న ఈ సమావేశంలో భారత్ తరఫున విదేశాంగ శాఖ కార్యదర్శి పాల్గొంటారని తెలిపారు. దిల్లీలో విలేకరుల సమావేశంలో ఈ వివరాలను ఆయన తెలియజేశారు. ఎల్‌పీజీ, ఎల్ఎన్‌జీ, ఇతర ఇంధన ఉత్పత్తులతో కూడిన భారత నౌకలను సురక్షితంగా, అంతరాయం లేకుండా దేశానికి తీసుకొచ్చే అంశంపై ఇరాన్ సహా ఇతర దేశాలతో భారత్ సంప్రదింపులు జరుపుతోందన్నారు. ఈ సంప్రదింపుల ఫలితంగానే గత కొన్ని రోజుల వ్యవధిలో 6 భారతీయ నౌకలను సేఫ్‌గా హర్మూజ్ జలసంధిని దాటించగలిగామని రణధీర్ జైస్వాల్ చెప్పారు. అందుకే అన్ని సంబంధిత పక్షాలతో సమన్వయం చేసుకుంటూ భారత్ ముందుకు సాగుతోందన్నారు.

స్వేచ్ఛాయుత, సురక్షిత హర్మూజ్ కోరుకుంటున్నాం'

హర్మూజ్ జలసంధి మీదుగా రాకపోకలు సాగించే నౌకలపై ఇరాన్ దాడులను ఖండిస్తూ బహ్రాయిన్ ప్రవేశపెట్టిన తీర్మానానికి ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఆమోదం తెలిపింది. భారత్ సైతం అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా సముద్ర మార్గంలో వాణిజ్య నౌకల రవాణాకు స్వేచ్ఛాయుత, సురక్షిత పరిస్థితులు ఉండాలని కోరుకుంటుందని రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. హర్మూజ్ మీదుగా స్వేచ్ఛాయుత, సురక్షిత స్థితిలో నౌకల రాకపోకలు జరగాలి అనే దానికి భారత్ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మొదటి నుంచీ ఇదే విషయాన్ని స్పష్టంగా చెబుతోందన్నారు. పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న అన్ని పరిణామాలను భారత్ నిశితంగా పరిశీలిస్తోందని ఆయన చెప్పారు. దీన్నిబట్టి ఐక్యరాజ్యసమితి చర్చలో ఉన్న బహ్రాయిన్ తీర్మానంపై భారత్‌కు ఎలాంటి వైఖరి ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ తీర్మానం ప్రాతిపదికన పశ్చిమాసియా యుద్ధంలోని సంబంధిత దేశాలతో ప్రస్తుతం ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలోని సభ్యదేశాలు సంప్రదింపులు జరుపుతున్నాయని రణధీర్ జైస్వాల్ గుర్తు చేశారు.

ప్రతిపక్షం

Prathipaksham.in



దానిమ్మగింజలతో..

కావలసిన పదార్థాలు

దానిమ్మ గింజలు	: ఒకటిన్నర కప్పు
నానబెట్టిన సబ్జాగింజలు	: రెండు పెద్ద చెంచాలు
గడ్డ పెరుగు	: కప్పు
పిస్తా పలుకులు	: కొన్ని

తయారుచేసే విధానం

ఒక కప్పు దానిమ్మ గింజలను జ్యూస్‌గా చేసుకోవాలి. ఆ జ్యూస్‌లో దానిమ్మ గింజలు, సబ్జా గింజలు వేసుకుని కలపాలి. ఈ రసాన్ని రెండు, మూడు గంటలపాటు ఫ్రిజ్‌లో ఉంచాలి. సబ్జా గింజలు బాగా నానిపోయిన తరువాత ఫ్రిజ్‌లోంచి తీసేయాలి. గ్లాసులో ముందుగా దానిమ్మరసం, సబ్జాగింజల జ్యూస్ పోయాలి. దీనిపై పెరుగు వేయాలి. ఇలా మరో వరుస చేసుకుని పైన కొన్ని పిస్తాపలుకులు వేసుకోవాలి. ఇలా మూడు, నాలుగు వరుసలుగా వేసుకుని పైన పిస్తా పప్పులు చల్లుకోవాలి. దీనిలో కావాలనుకుంటే చెర్రీ పండ్లను కూడా వేసుకోవచ్చు. దీన్ని చల్లచల్లగా సర్వ్ చేస్తే వేసవిలో మజాగా ఉంటుంది.

క్వినోవాతో..

కావలసిన పదార్థాలు

పెరుగు: రెండు కప్పులు	నిమ్మకాయ: ఒకటి
పుదీనా తరుగు: రెండు చెంచాలు	వండిన క్వినోవా: కప్పు
నల్లద్రాక్ష: పది	కీరదోస తురుము: 2 చెంచాలు
మామిడి తురుము: రెండు చెంచాలు	కొత్తిమీర: కట్ట
ఆలివ్‌నూనె: చెంచా	స్ట్రాబెర్రీలు: కొన్ని

తయారుచేసే విధానం

ఒక గిన్నెలో పెరుగు, పుదీనా తరుగు, సగం నిమ్మరసం వేసి ఫ్రిజ్‌లో అరగంట సేపు ఉంచాలి. ఇంతలో క్వినోవా, కీరదోస తురుము, మామిడి తురుము, కొత్తిమీర తరుగు, ఆలివ్‌నూనె, మిగిలిన నిమ్మరసం వేసుకుని అన్నింటినీ బాగా కలపాలి. అరగంటయ్యాక పెరుగును ఫ్రిజ్‌లోంచి బయటకు తీయాలి. గ్లాసుల్లో ముందుగా కొద్దిగా పెరుగు, దానిపై క్వినోవా మిశ్రమం, నల్లద్రాక్ష, స్ట్రాబెర్రీలు వేయాలి. తరువాత మళ్లీ పెరుగు.. ఇలా వరుసలుగా గ్లాసుల్లో వేసుకుంటూ రావాలి. పైన పండ్ల ముక్కలను వేసుకుంటే చాలు. క్వినోవాకు బదులు ఉడికించిన కొర్రలు కూడా వేసుకోవచ్చు. పూర్తి పోషకాలతో నిండిన దీన్ని పిల్లలే కాదు, పెద్దలు కూడా ఇష్టపడతారు.



కూల్ కూల్ ఫలూదా



వేసవికాలంలో అనారోగ్య సమస్యలు అంటే.. ఫ్లూ, కళ్ల కలక, మీజిల్స్, దగ్గు, జ్వరాల బారిన పడకుండా ఉండాలంటే జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా తీసుకునే ఆహార విషయంలో మరిన్ని జాగ్రత్తలు పాటించాలి. ఎందుకంటే ఈ కాలంలో జీర్ణవ్యవస్థ పనితీరు మందగిస్తుంది. అంతేకాదు ఎండ వేడిమికి శరీరంలోని నీరు ఆవిరై నిస్సత్తువ దరిచేరుతుంది. ఈ సమయంలో ఏమీ తినాలనిపించదు.. చల్లచల్లగా ఏదో ఒకటి తాగాలనిపిస్తుంది.. అప్పుడు మార్కెట్లో దొరికే కూల్‌డ్రింక్స్‌ను కాకుండా ఇంట్లోనే తయారుచేసుకునే ఫలూదా వంటి పానీయాలు తాగడం వల్ల ఆరోగ్యానికి ఆరోగ్యం, ఆనందానికి ఆనందం.. వీటివల్ల శరీరంలో వేడి తగ్గిపోయి చలువ చేస్తుంది.. మరి అలాంటి పానీయాలను చూద్దామా..




మామిడితో..

కావలసిన పదార్థాలు

సబ్జా గింజలు	రెండు చెంచాలు
మొక్కజొన్న పిండి	పావు కప్పు
చల్లటిపాలు:	కప్పు
మామిడిపండు గుజ్జు	కప్పు
ఐస్‌క్రీమ్	కప్పు
టూటీఫ్రూటీ	కొన్ని
బాదం	ఐదు
జీడిపప్పు	ఐదు
కిస్‌మిస్	పది

తయారుచేసే విధానం

ఒక గిన్నెలో సబ్జా గింజలను నానబెట్టుకోవాలి. మరొక గిన్నెలో కాసిని నీళ్లు తీసుకుని మొక్కజొన్న పిండిని వేస్తూ బాగా పల్చగా తయారుచేసుకోవాలి. స్టవ్ వెలిగించి బాణలి ఉంచి ఒకటిన్నర కప్పులు నీళ్లు పోయాలి. అవి మరుగుతున్నప్పుడు తయారుచేసిపెట్టుకున్న మొక్కజొన్న పిండి మిశ్రమాన్ని అందులో పోస్తూ సన్నని మంటపై ఉడికించాలి. ఇది చిక్కగా అయ్యేవరకు కలపాలి. ఈ మిశ్రమాన్ని చల్లార్చి మురుకుల పీటలోకి తీసుకోవాలి. ఒక గిన్నెలో ఐస్ ముక్కలు తీసుకుని వాటిపై మురుకుల్లా మొక్కజొన్న పిండిని ఒత్తుకోవాలి. ఇవి సన్నగా న్యూడుల్స్‌లా వస్తాయి. ఇప్పుడు ఒక గ్లాసు తీసుకుని కాసిని సబ్జా గింజలు వేయాలి. ఆ తరువాత మొక్కజొన్న నూడుల్స్ కొద్దిగా వేసుకోవాలి. వీటిపై రెండు చెంచాల మామిడిపండు గుజ్జు వేయాలి. ఇందులో చల్లటిపాలు పోసి కొద్దిగా ఐస్‌క్రీమ్ వేయాలి. చివర్లో సబ్జాగింజలు, మామిడిపండు ముక్కలు, బాదం, కిస్‌మిస్, జీడిపప్పు పలుకులు, టూటీఫ్రూటీలతో అలంకరించి పైన మిగిలిన ఐస్‌క్రీమ్ వేయాలి. చల్లని, తియ్యని మ్యాంగో ఫలూదాను పిల్లలకు అందిస్తే ఎగిరి గంతేస్తారు.



సోయా పాలతో..

కావలసిన పదార్థాలు

సోయా పాలు	పావు కప్పు
మామిడిపండు గుజ్జు	కప్పు
పాలపొడి	నాలుగు చెంచాలు
మొక్కజొన్న పిండి	మూడు చెంచాలు
పాల క్రీమ్	రెండు చెంచాలు
పంచదార పొడి	నాలుగు చెంచాలు
నానబెట్టిన సబ్జా గింజలు	రెండు చెంచాలు

తయారుచేసే విధానం

ఒక గిన్నెలో పాలపొడి, మొక్కజొన్న పిండి, రెండు చెంచాల సోయాపాలు తీసుకుని పిండిలా కలిపి పెట్టుకోవాలి. మిగిలిన పాలను మరో గిన్నెలోకి తీసుకుని మరిగించుకోవాలి. అందులో పాలపొడి మిశ్రమం వేసి బాగా కలిపి ఐదు నిముషాల తర్వాత దింపేయాలి. ఇది చల్లారాక మామిడిపండు గుజ్జు, క్రీమ్, పంచదార పొడి వేసి బాగా కలపాలి. ఓ అల్యూమినియం గిన్నెలో ఈ మిశ్రమాన్ని తీసుకుని డీప్ ఫ్రీజర్‌లో ఉంచాలి. రెండు గంటల తరువాత బయటకు తీసి మరోసారి మిక్సీ పట్టాలి. చిక్కగా అయిన మిశ్రమాన్ని గ్లాసులో తీసుకుని పైన సబ్జా గింజలు వేసుకుని తాగితే సరిపోతుంది.




కస్టర్డ్‌తో..

కావలసిన పదార్థాలు

ఫలూదా సేవ్	రెండు చెంచాలు
సబ్జా గింజలు	చెంచా
పాలు	రెండు కప్పులు
రూఅఫ్జా	చెంచా
వెనిల్లా ఐస్‌క్రీమ్	ఒక స్పూన్
కస్టర్డ్ పొడి	చెంచా
డ్రైఫ్రూట్స్	మూడు చెంచాలు
పంచదార	రెండు చెంచాలు

తయారుచేసే విధానం

రెండు చెంచాల పాలు తప్ప మిగిలిన పాలను ఒక గిన్నెలోకి తీసుకుని మరిగించాలి. ఇంతలో పక్కకు తీసిన పాలల్లో కస్టర్డ్ పొడి వేసి కలుపుకోవాలి. ఇప్పుడు మరిగిన పాలల్లో సేవ్, పంచదార వేసి కలపాలి. తరువాత పాలల్లో కలిపిన కస్టర్డ్ కూడా వేసి రెండు నిముషాల తరువాత స్టవ్ కట్టేయాలి. ఇది చల్లారాక ముందు రూఅఫ్జాని గ్లాసుల్లో వేసి తరువాత పాల కస్టర్డ్‌ని వేయాలి. దానిపైన సబ్జాగింజలు వేసుకోవాలి. చివరగా ఐస్‌క్రీమ్, డ్రైఫ్రూట్స్ వేసుకుంటే చాలు కస్టర్డ్ ఫలూదా తయారు.



పండ్లముక్కలతో..

కావలసిన పదార్థాలు

సగం ఉడికించిన సేవ్	అరకప్పు
పాలు	కప్పు
నానబెట్టిన సబ్జా గింజలు	చెంచా
ఆపిల్	అర కప్పు
అరటిపండు	అర కప్పు
పైనాపిల్ ముక్కలు	అర కప్పు
దానిమ్మ గింజలు	పావు కప్పు
రోజ్ సిరప్	చెంచా
కండెన్స్‌డ్ మిల్క్	పావు కప్పు

తయారుచేసే విధానం

ఒక గ్లాసులో ముందు సేవ్ తీసుకోవాలి. తరువాత పాలు పోసి, సబ్జా గింజలు వేయాలి. దానిపైన రోజ్ సిరప్ వేయాలి. తరువాత పండ్ల ముక్కలు వేసి, కండెన్స్‌డ్ మిల్స్ వేయాలి. ఇప్పుడు మిగిలిన పాలు పోసి రెండు గంటలు ఫ్రిజ్‌లో ఉంచి, బయటకు తీసి దానిమ్మ గింజలతో అలంకరిస్తే రుచికరమైన ఫలూదా తయారు.

రాఘవ్ చద్దాకు షాకిచ్చిన 'ఆప్'

- రాజ్యసభ డిప్యూటీ నేత హోదా తొలగింపు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: ఆమ్ ఆద్మీ పార్టీ తమ స్వంత ఎంపీ రాఘవ్ చద్దాకు షాకిచ్చింది. రాజ్యసభ డిప్యూటీ నేత హోదా నుంచి అతన్ని తప్పించింది. అతని స్థానంలో పంజాబ్ ఎంపీ అశోక్ మిట్టల్‌ను భర్తీ చేసింది. లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో అశోక్ మిట్టల్ ఛాన్సలర్‌గా ఉన్నారు. ప్రస్తుతం రాజ్యసభలో ఎంపీ సంజయ్ సింగ్ ఆ పార్టీ నేతగా కొనసాగుతున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీకి రాజ్యసభలో మొత్తం 10 మంది సభ్యులు ఉన్నారు. పంజాబ్ నుంచి ఏడుగురు, ఢిల్లీ నుంచి ముగ్గురు ఉన్నారు. రాజ్యసభలో బీజేపీ, కాంగ్రెస్, టీఎంసీ తర్వాత నాలుగవ అతి పెద్ద పార్టీగా ఆప్ నిలిచింది. అయితే రాఘవ్ చద్దాను డిప్యూటీ నేత స్థానం నుంచి తొలగించడం చర్చనీయాంశంగా మారింది. ఎందుకంటే ఓ సమయంలో ఆప్‌లో అతను కీలక నేతగా వ్యవహరించారు. కేజ్రీవాల్‌తో అత్యంత సన్నిహితంగా ఆయన ఉండేవారు. ఆప్ పుట్టిన నాటి నుంచి 37 ఏళ్ల చద్దా ఆ పార్టీతోనే ఉన్నారు. ఢిల్లీ మాడర్న్ స్కూల్ అల్యూమినిలో ఉన్న ఆయన.. ఛార్టర్డ్ అకౌంటెంట్ కూడా. అవినీతి ఉద్యమం చేపడుతున్న రోజుల్లో కేజ్రీవాల్‌కు చద్దా పరిచయమయ్యారు. 23 ఏళ్ల వయసులో ఆప్‌లో రాఘవ్ చద్దా కీలక పాత్ర పోషించారు.





యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్ దోపిడీలతో ప్రజలు విసిగిపోయారు

- ఈసారి కేరళలో కొత్త ప్రభుత్వం : మోదీ

ప్రతిపక్షం, నేషనల్ డెస్క్: కేరళలో బీజేపీకి మద్దతు పెరుగుతుందని, తిరువనంతపురం స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించిన విజయం ఇందుకు నిదర్శనమన్నారు ప్రధాని నరేంద్ర మోదీ. ఈ సారి కేరళ కేవలం కొత్త ప్రభుత్వాన్నే కాకుండా, కొత్త వ్యవస్థను కూడా ఎన్నుకుంటోందని స్పష్టమవుతోందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం కేరళలోని బీజేపీ బూత్ కార్యకర్తలతో వర్చువల్‌గా సమావేశమై ప్రసంగించారు. ప్రతి ఇంటినీ సందర్శించి ఈసారి బీజేపీఎన్‌డీఏకు అవకాశం ఇవ్వమని ప్రజలను కోరాలని ప్రధాని మోదీ బూత్ కార్యకర్తలను కోరారు. కేరళలోని ప్రతీ కార్యకర్త ఒక మోదీ అని కొనియాడారు. ఈ క్రమంలోనే సందర్భానికి తగ్గట్టుగా రాణించాల్సి ఉంటుందన్న ప్రధాని మోదీ, కేరళ బ్యాటర్ సంజు శాంసన్‌ను ప్రస్తావించారు. "సంజు శాంసన్ ప్రదర్శనల్లో మనం దీనిని తరచుగా చూస్తుంటాం. ప్రపంచ కప్ సమయంలో, టోర్నమెంట్ కీలకమైన నాకౌట్ దశకు చేరుకున్నప్పుడు అతడి ప్రదర్శన పతాక స్థాయికి చేరింది. ఆరంభం నుంచి ముగింపు వరకు అతడి ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం మరింత బలపడ్డాయి. ఇవి ఒక నిజమైన క్రీడాకారుడి లక్షణాలు. ఒక గొప్ప ఆటగాడు తన జట్టుకు అత్యంత అవసరమైనప్పుడు ఎల్లప్పుడూ రాణిస్తాడు. అదేవిధంగా ఓటింగ్ రోజున, ప్రతి ఇంటినీ చేరుకోవడానికి మనం చేసే ప్రయత్నాలు మరింత బలంగా ఉండాలి. ఈ సమయంలోనే మీ అంకితభావం అత్యంత ముఖ్యం. విజయాన్ని సాధించడానికి మీరు అదనపు గంటలు పనిచేయాల్సి రావచ్చు." అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.





సినిమా



తెలుగు సినిమాలపై సెటైర్

తమిళ చిత్రం 'డ్రాగన్' తో పాపులర్ అయిన కయాదు లోహార్ తెలుగులోనూ అవకాశాలు అందుకుంటోన్న సంగతి తెలిసిందే. ఇటీవలే రిలీజ్ అయిన 'ఫంకీ'లోనూ విశ్వక్ సేన్ కు జోడీగా నటించింది. అయితే ఈ సినిమా ఆశించిన ఫలితాన్ని సాధించలేదు. ప్రస్తుతం నేచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తోన్న 'ది ప్యారడైజ్' లో నటిస్తోంది. ఇవిగాక తమిళ, మలయాళ సినిమాలోనూ బిజీగా ఉంది. తాజాగా ఈ బ్యూటీ నటించిన ఓ మలయాళ చిత్రం తెలుగులో రిలీజ్ అవుతుంది. ఈ సినిమా ప్రచారంలో భాగంగా అమ్మడు తెలుగు సినిమాలపై సెటైర్ వేసింది. తెలుగులో ఆమె నటించిన చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను అందుకోకపోవడంతో అమ్మడు తనదైన శైలిలో స్పందించింది. ఒక రకంగా సెటైరికల్‌గా అనిపించేలా ఆమె చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చకు తీస్తున్నాయి. తాను నటించిన సినిమాలు పరాజయం పాలవ్వడం గురించి తనకు ఎటువంటి విచారం లేదన్నట్లు వ్యాఖ్యానించింది. 'సినిమా రిజల్ట్ అనేది మన చేతుల్లో ఉండదు. నేను నా వంతు ప్రయత్నం చేశాను. కానీ అవి ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయాయి' అని పేర్కొంది. అంతటితో ఆగకుండా ఆ సినిమాల వైఫల్యాల గురించి కూర్చుని బాధపడేంత తీరిక కూడా తనకు లేదని అనడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

వీరులు పుట్టకముందే.. రామ ఉన్నాడు

రామాయణ రామ పాత్రలో రణబీర్ కపూర్ ఫస్ట్ గ్లింప్స్ లాంచ్


ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన చిత్ర నిర్మాణాలలో ఒకటైన రామాయణం వెనుక ఉన్న నిర్మాత, ఫిలిం మేకర్ నమిత్ మల్హోత్రా, కథనంలో అత్యంత చిరస్థాయిగా నిలిచిపోయే పాత్రలలో ఒకటైన 'రామ'ని ఒక ప్రత్యేక టీజర్ ద్వారా పరిచయం చేస్తున్నారు. ఈ టీజర్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు రాముడిగా రణబీర్ కపూర్ తొలిసారిగా కనిపిస్తున్నారు.

ఒక ప్రపంచ ఘట్టం:
ప్రపంచవ్యాప్తంగా అంతే వైభవంతో విడుదలైన 'రామ' టీజర్, 5,000 సంవత్సరాలకు పైగా నిలిచివున్న ఒక కథానాయకుడిపై ప్రపంచ దృష్టిని కేంద్రీకరిస్తూ, ప్రపంచ ప్రేక్షకులకు ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలుస్తుంది. ఈ కథతో పెరిగిన వారికి, ఇది ఒక సరికొత్త దృక్కోణాన్ని అందిస్తుంది.

తాను తీసుకున్న నిర్ణయాల ద్వారా నిర్వచించబడిన వీరుడు :
ఈ రోజుల్లో ప్రపంచం అరుదుగా చూసే వీరుడికి రాముడు ప్రతీక. కోరికల కన్నా కర్తవ్యానికే ప్రాధాన్యతనిచ్చే వీరుడు. సరైనది అయినప్పుడు అధికారాన్ని వదులుకునేవాడు. సర్వస్వం కోల్పోవాల్సి వచ్చినా, చేయవలసినది చేసేవాడు. 'మానవ ప్రవర్తనకు అత్యున్నత ఆదర్శం' అయిన మర్యాదా పురుషోత్తముడిగా పూజించబడే రాముడు, వనవాసం, నష్టం, అన్యాయం ఎదురైనా గౌరవం, కరుణ, నైతిక స్పష్టతలకు ప్రతిరూపంగా నిలుస్తాడు.

రన్‌బీర్ కపూర్ మాట్లాడుతూ:
"నేను రాముడిని ప్రతినిధ్యం చేయడానికి రాలేదు. ఆయన నుండి నేర్చుకోవడానికి వచ్చాను. ఆయనలో ఉన్న సరళత, పవిత్రత చాలా అరుదు. ఆ లక్షణాలను అర్థం చేసుకోవడం నాకు వినయపూర్వకమైన అనుభవం."

నమిత్ మల్హోత్రా మాట్లాడుతూ:
"రాముడి కథ గొప్పది ఎందుకంటే ఆయన గెలిచిన యుద్ధాలు కాదు, ఆయన విడిచిపెట్టిన విషయాలే. ఆయన ఎప్పుడూ కర్తవ్యాన్ని కోరికల కంటే, నిజాన్ని సౌకర్యం కంటే, త్యాగాన్ని స్వార్థం కంటే ఎంచుకున్నాడు. అందుకే ఈ కథ వేల సంవత్సరాలుగా నిలిచింది."



పహిల్వాన్ 'పెద్ది'

హనుమాన్ జయంతి సందర్భంగా పోస్టర్ రిలీజ్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మోస్ట్ ఎవైటెడ్ పాన్‌ఇండియా యాక్షన్ డ్రామా 'పెద్ది' హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. మొదటి రెండు పాటలకు, ఇప్పటివరకు విడుదలైన రెండు గ్లింప్స్‌లకు వచ్చిన అద్భుతమైన స్పందనతో దేశవ్యాప్తంగా భారీ హైప్‌ను సృష్టిస్తోంది. ముఖ్యంగా, రామ్ చరణ్ పుట్టినరోజు ప్రత్యేక గ్లింప్స్ స్ట్రాంగ్ ఇంపాక్ట్ క్రియేట్ చేసింది. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో, వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మించిన ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నారు. హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని, మేకర్స్ ఒక శక్తివంతమైన కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో రామ్ చరణ్ తన కెరీర్‌లోనే మోస్ట్ ఇంటెన్స్, ఆధ్యాత్మికత తో కూడిన అవతార్‌లో కనిపిస్తున్నారు. ఈ పోస్టర్‌లో చరణ్ ఒక పల్లెటూరి అఖాడా మధ్యలో నిలబడి వుండగా, ఆయన ప్రెజెన్స్ ఒక్కసారిగా అందరినీ కట్టిపడేసింది. పహెల్వాన్‌లా తీర్చిదిద్దుకున్న శరీరం, రగ్గడ్ గడ్డం, వెనక్కి కట్టిన జుట్టు, అన్నీ కలిసి గ్రామీణ అసలైన వాతావరణాన్ని బలంగా ప్రజెంట్ చేస్తున్నాయి. భూమిలో లోతుగా నాటుకుపోయిన భారీ చెక్క గదను పట్టుకుని ఉన్న చరణ్, హనుమను గుర్తు చేసేలా అద్భుతంగా కనిపించారు. అతని చుట్టూ ఎగిసిపడుతున్న ధూళి ఆ క్షణంలోని ఇంటన్సిటీని మరింత పెంచుతోంది. బ్యాక్‌గ్రౌండ్‌లో కుస్తీ సాధన చేస్తున్న రెజ్లర్లు పోస్టర్‌కు మరింత బలాన్ని చేకూరుస్తున్నారు.



ఒక్క రనౌట్..

సన్ రైజర్స్ భారీ విజయం



ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఎట్టకేలకు బోణీ కొట్టింది. గురువారం ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ 65 పరుగుల భారీ తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను చిత్తు చేసింది. ముందుగా బ్యాటర్లు విధ్వంసకర బ్యాటింగ్‌తో భారీ విజయం సాధిస్తే.. ఆ తర్వాత బౌలర్లు నిప్పులు చెరిగారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 226 పరుగులే చేసింది. హెన్రీచ్ క్లాసెన్(35 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 52) హాఫ్ సెంచరీతో రాణించగా.. ట్రావిస్ హెడ్(21 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లతో 46), అభిషేక్ శర్మ(21 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 48) దూకుడుగా ఆడారు. కేకేఆర్ బౌలర్లలో బ్లెస్సింగ్ ముజరబాని(4/41) నాలుగు వికెట్లు తీయగా.. వైభవ్ అరోరా(2/47) రెండు వికెట్లు పడగొట్టాడు. కార్తీక్ త్యాగీ, అంకూల్ రాయ్ చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం కేకేఆర్ 16 ఓవర్లలో 161 పరుగులకు ఆలౌటైంది. అంగ్‌క్రిష్ రఘువంశీ(29 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 52) హాఫ్ సెంచరీతో రాణించగా.. రింకూ సింగ్(25 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 35), ఫిన్ అలెన్(7 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 28) దూకుడుగా ఆడారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో జయదేవ్ ఉనాద్కత్(3/21) మూడు వికెట్లు తీయగా.. ఎషాన్ మలింగా(2/14), నితీష్ కుమార్ రెడ్డి(2/17) రెండేసి వికెట్లు పడగొట్టారు. హర్ష్‌దూబేకు ఒక వికెట్ దక్కింది. 227 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో అదిరిపోయే ఆరంభాన్ని అందుకున్న కేకేఆర్.. అనవసర రనౌట్స్‌తో మూల్యం చెల్లించుకుంది. ముఖ్యంగా అసాధారణ బ్యాటింగ్‌తో హాఫ్ సెంచరీ సాధించిన రఘు వంశీ ఈ రెండు రనౌట్స్‌కు కారణమయ్యాడు. ముందుగా అనవసర పరుగు పరుగెత్తి కామెరూన్ గ్రీన్(2) రనౌట్‌కు కారణమైన అతను రెండోసారి తానే వికెట్ పారేసుకున్నాడు. ముఖ్యంగా రింకూ సింగ్‌తో కలిసి ఐదో వికెట్‌కు 46 పరుగులు జోడించిన అనంతరం రనౌట్‌గా వెనుదిరిగి కేకేఆర్ ఓటమికి కారణమయ్యాడు. ఎషాన్ మలింగా అద్భుత త్రోతో రఘువంశీ రనౌట్‌గా వెనుదిరిగాడు. ఈ రనౌట్ మ్యాచ్‌కు టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. ఆ తర్వాత కేకేఆర్ వరుసగా వికెట్లు కోల్పోయి ఓటమిపాలైంది.



వికెట్ టేకింగ్ ఆప్షన్ కోసమే హర్ష్ పటేల్‌ను పక్కన పెట్టాం

ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ తో ఈడెన్ గార్డెన్స్ వేదికగా రుగుతున్న మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని కేకేఆర్ కెప్టెన్ అజింక్యా రహానే తెలిపాడు. గాలీ వీస్తుండటంతో మంచు ప్రభావం ఏ మేరకు ఉంటుందో చెప్పలేమన్నాడు. వర్షం పడే అవకాశాలు ఉండటంతోనే ముందుగా బౌలింగ్ చేయాలనుకున్నామని చెప్పాడు. మేం ముందుగా బౌలింగ్ చేయబోతున్నాం. ఆటను మెరుగుపరుచుకోవడానికి ఎప్పుడూ అవకాశం ఉంటుంది. గత మ్యాచ్‌లో ఓడినా.. చాలా సానుకూల అంశాలు ఉన్నాయి. సాధారణంగా ఈడెన్ గార్డెన్స్‌లో ఇంత గడ్డిని చూడం. పైగా వర్షం పడే సూచనలు కూడా ఉన్నాయి. అందుకే మేం ముందుగా బౌలింగ్ చేయాలనుకున్నాం. గాలి వీస్తున్నందున మంచు ప్రభావం ఎంతవరకు ఉంటుందో తెలియదు. ఈ పిచ్ 40 ఓవర్ల పాటు బాగానే సహకరిస్తుంది. కామెరూన్ గ్రీన్ చేయాల్సిందంతా చేస్తున్నాడు. త్వరలోనే బౌలింగ్ చేస్తాడు. మేం తుది జట్టులో ఎలాంటి మార్పులు లేకుండా బరిలోకి దిగుతున్నాం.' అని అజింక్యా రహానే చెప్పుకొచ్చాడు. మరోవైపు టాస్ గెలిస్తే తాము కూడా బౌలింగ్ ఎంచుకునేవాళ్లమని సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ఇషాన్ కిషన్ తెలిపాడు. తుది జట్టులో ఒక మార్పు చేశామని చెప్పిన ఇషాన్ కిషన్.. వికెట్ టేకింగ్ ఆప్షన్ కోసం శివాంగ్ కుమార్‌ను తుది జట్టులోకి తీసుకున్నామని పేర్కొన్నాడు. దాంతో హర్షల్ పటేల్ ఉద్వాసనకు గురయ్యాడని తెలిపాడు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: MOHAMMED AZIZ UR RAHAMAN. 040-4565 1990, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200